


మార్కండేయ.. నమోనమః

కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మార్కాపురంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేయ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. కొందరు అభిషేకాలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

- ఆంధ్రజ్యోతి, మార్కాపురం వన్‌టౌన్



7

శభాష్!

మొంథా తుఫాన్ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చురుగ్గా పనిచేసిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ రాజాబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సమర్థ పర్యవేక్షణతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చన్నారు. తుఫాన్ సమయంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు.

జల సంరక్షణే లక్ష్యం

గ్రామాలవారీ నీటి బడ్జెట్

- అందుకు అనుగుణంగానే ఉపాధి పనులు
- నీటి నిల్వపైనే ప్రభుత్వాల దృష్టి
- రానున్న ఏడాది లేబర్ బడ్జెట్‌లో అదే ప్రధానం
- వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రతిపాదనలు



జిల్లాలో గ్రామాల వారీ నీటి బడ్జెట్ (లెక్కల)పై నీటి యాజమాన్య సంస్థ దృష్టి సారించింది. వచ్చే ఏడాది ఉపాధి హామీ పథకంలో జలసంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఈ నేపథ్యంలో సమగ్ర నీటి ప్రణాళికకు ఆశాఖ చర్యలు ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులను ఉపాధి హామీ పథకానికి ఇస్తుండగా రాష్ట్రంలో పెద్దఎత్తున కూలీలకు పనుల కల్పన జరుగుతోంది. అలాగే ఆ పథకం మెటీరియల్ కోటా నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల పెంపు పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. జిల్లాలోనూ పెద్దఎత్తున పనులు చేస్తున్నారు. అయితే ఈసారి నీటి సంరక్షణపై దృష్టి సారించడం విశేషం.

ఒంగోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని అటు కూలీలకు ప్రయోజనకరంగా, ఇటు గ్రామాల్లో సౌకర్యాల పెంపునకు పెద్దఎత్తున ఉపయోగిస్తున్నారు. ఆ పనుల్లో భాగంగా వచ్చే ఏడాది నీటి సంరక్షణకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాలు ఆదేశించాయి. ప్రధానంగా గ్రామాల వారీ ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, వాటి ద్వారా లభ్యత, ఆ గ్రామంలో అవసరాలను లెక్కించి లోటును వర్షపు నీరు నిల్వ చేయడం, లేదా భూమిలోకి ఇంకేలా చూసి భర్తీ చేసే పనులు చేపట్టాలన్న ఆదేశాలు ప్రభుత్వం నుంచి అందాయి. దీంతో ఆవైపు జిల్లాలో డ్వామా అధికారులు దృష్టి సారించారు. ఏటా అక్టోబరు నుంచి డిసెంబరు ఆఖరు వరకు తదుపరి ఏడాది గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల గుర్తింపు, అంచనాలు రూపొందించడం వంటి ప్రక్రియను డ్వామా సిబ్బంది చేస్తారు. అలా వచ్చే ఏడాదికి సంబంధించిన ప్రక్రియను ప్రస్తుతం ప్రారంభించారు. ఈ సమయంలోనే నీటి లెక్కలు తేల్చి తదనుగుణంగా వచ్చే ఏడాది పనులు ప్రతిపాదించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని డ్వామా అధికారులు ఆదేశించారు. అలా గ్రామాల వారీ నీటి బడ్జెట్‌లను సిబ్బంది రూపొందించే పనిని ప్రారంభించారు.



రాచర్ల మండలం సత్యవోలులో జలసంరక్షణ పనుల నమూనాను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వాటర్‌షెడ్ గ్రామాలే ప్రామాణికం

ప్రాథమికంగా ఇప్పటివరకు ఉన్న లెక్కల ద్వారా పరిశీలించి మెట్ట ప్రాంతాల్లోని అత్యధిక గ్రామాల్లో అవసరమైన నీటిలో కేవలం నాల్గో వంతు మాత్రమే అందుబాటులో ఉంటున్నట్లు అంచనా వేశారు. అందుకు వాటర్‌షెడ్ అమలు ఉన్న గ్రామాలను ప్రామాణికంగా తీసుకున్నారు. సగటున ఒక గ్రామం 500 హెక్టార్ల విస్తీర్ణంలో ఉండి వార్షిక సగటు వర్షపాతం 600 మి.మీ అనుకుంటే.. ఆ గ్రామంలో ఏడాదికి వర్షం ద్వారా లభించే నీరు 300 హెక్టా మీటర్లుగా గుర్తించారు. అందులో 9శాతం భూగర్భ జలంగా మారుతుంది. మరో పదిశాతం భూమిలో తేమ, 41శాతం ఆవిరి లేదా చెట్లు గ్రహిస్తాయి. మరో 40శాతం మేర వాగులు, వంకలు, కాలువల ద్వారా పారి బయటకు వెళ్లిపోతోంది. ఆ ప్రకారం చూస్తే వర్షం ద్వారా లభించే 300 హెక్టా మీటర్ల నీటిలో కేవలం 32 హెక్టా మీటర్లు మాత్రమే అందుబాటులో ఉంటోంది. మిగిలిన 270 హెక్టా మీటర్లు బయటకు వెళ్లిపోవడం లేదా ఆవిరి, చెట్లు గ్రహించడంతో సరిపోతుంది. అయితే 500 హెక్టార్ల విస్తీర్ణంలో ఉండే గ్రామంలో మనుషులు, పశుసంపద, పంటలు, పండ్ల తోటలు, కూరగాయల సాగు ఇతరత్రా అవసరాలకు సుమారు 121.41 హెక్టామీటర్ల నీరు అవసరమని అంచనా. అలా నీటి లభ్యత 32 హెక్టా మీటర్లు అయితే అవసరం 121.41 హెక్టామీటరుగా ఉంది. అంటే అలాంటి గ్రామాల్లో 89.40హెక్టామీటర్ల కొరత ఉంటూ నిత్యం నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు.

జల సంరక్షణ పనులకు రూపకల్పన

జిల్లాలోని అత్యధిక గ్రామాల్లో తక్కువగానే నీరు ఉంటుండగా కొన్నింటిలో కొంత ఎక్కువ నీటి లభ్యతకు అవకాశం ఉంది. ఆ మేరకు ప్రాథమిక అంచనా వేసి తదనుగుణంగా గ్రామాల వారీ నీటి బడ్జెట్ రూపకల్పన చేయాలని డ్వామా ద్వారా నిర్ణయించారు. ప్రధానంగా ఈ బడ్జెట్‌లో ఆ గ్రామంలో మొత్తం విస్తీర్ణం, జనాభా, పశుసంపద, సగటు వర్షపాతం, ఉన్న నీటి వనరులు, వాటిలో నీరు ఎంత నిల్వ ఉండే అవకాశం ఉంటుంది తదితరాలు గుర్తిస్తారు. తదనుగుణంగా కొరతను అంచనా వేస్తారు. అనంతరం దానిని అధిగమించేందుకు చేపట్టాల్సిన పనులను గుర్తిస్తారు. ప్రధానంగా చెరువులు, చెక్‌డ్యాంలు, కాలువలు, వాగులలో పూడికతీత, గ్రామంలో ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, పొలాల్లో పంట కుంటలు, ఏటవాలు ప్రాంతంలో కందకాల తవ్వకం వంటి జలసంరక్షణ పనులను ప్రతిపాదించనున్నారు. వచ్చే ఏడాది కూలీలకు పనులు కల్పించే లేబర్ బడ్జెట్ ప్రతిపాదనలను నీటి బడ్జెట్‌కు అనుగుణంగా గ్రామాలవారీ నిర్దిష్టంగా రూపొందించనున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు.


మద్దులూరు స్కూల్‌లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు

పరిశుభ్రత పాటిద్దాం..

- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- విద్యా సంస్థలపై ఎక్కువ దృష్టి
- ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఒంగోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం పరిశుభ్రత పాటిద్దాం కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ప్రతినెలా మూడో శనివారం రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వారం వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశాన్ని ప్రధానంగా తీసుకున్నారు. తదనుగుణంగా జిల్లావ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. గ్రామస్థాయి వరకు విద్యా సంస్థల్లో పరిశుభ్రత చర్యలతోపాటు విద్యార్థులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మొక్కలను కూడా నాటారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సంతనూతలపాడు మండలం మద్దులూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కలెక్టర్ రాజాబాబు హాజరయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కనిగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. గిద్దలూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని పరిశుభ్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు ఇతర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున పరిశుభ్రత పాటిద్దాం కార్యక్రమాలు జరిగాయి.

ఎన్‌జీవో సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్

- 22న నామినేషన్ల స్వీకరణ
- 29న పోలింగ్

-7వపేజీలో..

చౌకగా బియ్యం, కందిపప్పు

- రైతు బజార్లలో విక్రయం
- ఒంగోలు లాయర్‌పేటలో ప్రారంభించిన జేసీ
- నేడు మరో రెండు కేంద్రాలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ మార్కెట్లో కందిపప్పు, బియ్యం ధరలు అధికంగా ఉండటంతో వాటిని సామాన్యులకు తక్కువ ధరకు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా ఒంగోలులో ముందుగా శనివారం ఒక విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం మరో రెండు కేంద్రాలను తెరవనున్నారు. రెండురోజుల క్రితం నిత్యావసర ధరల నియంత్రణ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నిర్వహించారు. బియ్యం, కందిపప్పు ధరలు బహిరంగ మార్కెట్లో అధికంగా ఉండటంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదని ఆ సందర్భంగా గుర్తించారు. దీంతో ముందుగా జిల్లాకేంద్రమైన ఒంగోలులోని మూడు రైతు బజార్లలో విక్రయాలు ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను జేసీ ఆదేశించారు. శనివారం లాయర్‌పేటలోని రైతు బజారులో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను జేసీ ప్రారంభించారు. దిబ్బలరోడ్డు, కొత్తపట్నం బస్టాండు వద్ద ఉన్న రైతు బజార్లలో ఆదివారం ఈ కేంద్రాలను ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.110 నుంచి రూ.120 వరకు ఉండగా... రైతుబజార్లలో కిలో రూ.100కే విక్రయించనున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం రూ.52 నుంచి 60 ఉండగా రైతుబజారులో ఒక రకం కిలో రూ.48, మరో రకం కిలో రూ.49కి అందుబాటులోకి తెస్తున్నారు. కందిపప్పు ఒక్కొక్కరికి అవసరమైతే రెండు కిలోలు కూడా ఇవ్వనున్నారు. బియ్యం బహిరంగ మార్కెట్లో 25 కిలోలు రూ.1,400కుపైగా ఉండగా రైతుబజారులో రూ.1,225కు విక్రయించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీతోపాటు రైతుబజారు ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.


బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ



నయనానందం..

గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో రోజుకో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం వివిధ పోటీలు నిర్వహించారు. నృత్య పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 7వ పేజీలో..

చేతులెత్తేసిన డీలర్లు

- స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో అయోమయం
- కార్డుదారులను గుర్తించేందుకు కష్టపడుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులు
- గ్రామీణ ప్రాంతాల్లో కొంత సమాచారం లభ్యం
- పట్టణాల్లో మాత్రం భారీగా పెండింగ్
- పాతవాటితోనే బియ్యం తీసుకుంటున్న వైనం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందించే విషయంలో రేషన్‌షాపు డీలర్లు చేతులెత్తేస్తున్నారు. గతంలో ఉన్న అడ్రస్‌ల ప్రకారం పౌరసరఫరాలశాఖ అధికారులు ఆ కార్డులను లబ్ధిదారులకు ఇచ్చే బాధ్యతను డీలర్లకు అప్పగించారు. నెలక్రితం వారు పంపిణీ ప్రారంభించారు. కార్డుదారులు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో డీలర్ వద్ద భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాకు 6,51,820 రైస్‌కార్డులు రాగా ఇప్పటివరకు 5,87,222 పంపిణీ చేశారు. ఇంకా 64,598 డీలర్ల వద్దనే ఉన్నాయి. గతంలో ఇచ్చిన తెల్లరేషన్ కార్డులో ఉన్న అడ్రసు ప్రకారం ఈ రైస్ కార్డులు ఆయా రేషన్ షాపుల డీలర్లకు అప్పగించగా ఇప్పుడు ఆ కార్డుదారులు ఎక్కడ ఉన్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అలాంటి వారిని గుర్తించడం కష్టతరంగా మారింది.



నెలాఖరులోపు పంపిణీ ఎలా?

గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువగా రైస్‌కార్డులు మిగలగా ఆ కార్డుదారులు ఎక్కడ ఉన్నారన్న దానిపై కొంత సమాచారాన్ని డీలర్లు సేకరించారు. పట్టణప్రాంతాల్లో మాత్రం పాత అడ్రస్సుల్లో కార్డుదారులు లేరు. పాత కార్డుల ద్వారా కూడా బియ్యం తీసుకునే సౌలభ్యం ఉండటంతో కొంతమంది ఈ నెలలో రేషన్ సరుకులు తీసుకున్నట్లు గుర్తించారు. ఇప్పుడు ఆ కార్డుదారులు ఏప్రాంతంలో తీసుకున్నారు? జిల్లాలోనా, లేక ఇతర ప్రాంతాల్లో తీసుకున్నారా? అనే విషయాన్ని గుర్తించే పనిలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయిలో కార్డుదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించడంతో ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న వారికి ఏవిధంగా పంపిణీ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.


ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ ఉద్యోగులు, కార్మికులు

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల్లో వక్తలు
- ఒంగోలులో ఘనంగా ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ

7

'మొంథా' సేవకులకు ప్రశంసాపత్రాలు





సర్టిఫికెట్‌లను అందుకుంటున్న ఎస్ఎన్‌పాడు ఎంపీడీవో సురేష్‌బాబు, కొండపి తహసీల్దార్ శ్రీనివాసరావు

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావానికి ప్రజలకు ఎటువంటి నష్టం కలుగకుండా చర్యలు తీసుకున్న అధికారులకు శనివారం ఒంగోలులో కలెక్టర్ పి.రాజాబాబు చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. మండలం నుంచి ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, రూరల్ ఎస్సై వి.అజయ్‌బాబు, మండలప్రత్యేక అధికారిగా పని చేసిన మెప్మా పీడీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు ప్రతాప్‌కుమార్, జ్యోతి, తదితరులు కలెక్టర్ చేతులమీదుగా సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

కొండపి/జరుగుమల్లి: మొంథా తుఫాన్ సమయంలో విశిష్ట సేవలు అందించి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో చురుగ్గా పనిచేసిన అధికారులకు శనివారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. వారిలో కొండపి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.రామాంజనేయులు, విద్యుత్‌శాఖ ఏఈ జి.శ్రీనివాసులు ఉన్నారు. విద్యుత్‌శాఖ జరుగుమల్లి ఏఈ హర్ష్, కామేపల్లి సబ్‌స్టేషన్ లైన్‌మన్ ఎస్.వి.రమేష్ కూడా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

సహకార సంస్థలతో మెరుగైన సేవలు

● డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఆర్ శ్రీనివాసరావు

ఒంగోలు విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు క్షేత్రస్థాయిలో సహకార సంస్థలను మరింత బలోపేతం చేయాలని సహకారశాఖ ఒంగోలు డిప్యూటీ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం ఒంగోలులోని పొగాకు ఉత్పత్తిదారుల సహకార యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి సంస్థ ఎండీ సురేంద్రబాబు అధ్యక్షత వహించారు. ముందుగా సహకార జెండాను ఆవిష్కరించిన శ్రీనివాసరావు సహకార రంగం ప్రాధాన్యత, సహకార సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సిబ్బందితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సహకార జోనల్ విద్యాధికారి జి.శ్రీనివాసులు, పొగాకు సమాఖ్య కార్యాలయ ఇన్‌చార్జి జి.హరినాథ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు కాగా ఒంగోలులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో కూడా సహకార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ నారాయణ, ఒంగోలు డీఆర్ శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు అరెస్ట్

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్యను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన గతంలో పాకల హైస్కూల్‌లో పని చేశారు. ఆ సమయంలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సెప్టెంబరులో పోక్సో కేసు నమోదైంది. అప్పటి నుంచి సస్పెన్షన్‌లో ఉన్నారు. విచారణలో హజరత్తయ్యపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనం కోసం రెండో విడత రూ.90 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని మైనారిటీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఈద్గామిట్టా షాదీఖానా ప్రాంగణంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ మైనారిటీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీనేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, సీనియర్ నాయకులు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, షేక్ యస్థాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఒంగోలు నగర శివారు ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రంగరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ద్వారకానగర్, లింగారెడ్డికుంట, మిల్క్‌ప్రాజెక్ట్, పీర్లమాన్యం, అరుణోదయకాలనీ, టీచర్స్‌కాలనీ, జడ్పీకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వెలుగు వీవోఏలు, డ్వాక్రా గ్రూపు సభ్యులకు పరిశుభ్రత, పచ్చదనంపై రిసోర్స్‌పర్సన్, మైనంపాడు పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని ప్రజలకు పరిశుభ్రత, పచ్చదనంపై ముమ్మరంగా అవగాహన కల్పించాలని కోరారు.

పొలాలకు వెళ్లే దారేది?

వర్షాలకు కోతకు గురైన పిచ్చిరెడ్డికుంట రహదారి

అన్నదాతల అగచాట్లు

పైర్లను కాపాడుకోలేక ఆందోళన



పిచ్చికుంటకు వెళ్లే దారిలో ఏర్పడిన గొయ్యిలో ఉన్న నీరు

మర్రిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మర్రిపూడి సమీపంలో పిచ్చిరెడ్డి కుంటకు వెళ్లే రహదారికి మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు భారీ గండి పడింది. అక్కడ నీరు కూడా నిలిచి ఉంది. దీంతో 15రోజులుగా పొలాలకు వెళ్లే దారి లేక, పైర్లను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారికి ఇరువైపులా మర్రిపూడికి చెందిన రైతులకు వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వాటిలో కంది, సజ్జ, పొగాకు సాగు చేశారు. పదిరోజుల క్రితం ఒక ట్రాక్టరు గోతిలో పడిపోవడంతో గ్రామస్థులు వెళ్లి మరో ట్రాక్టర్‌తో బయటకు లాగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ట్రాక్టర్ ఇంజన్ భాగం దెబ్బతింది. మూడు సంవత్సరాల క్రితం వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అనూహ్యంగా వరదనీరు రావడంతో చిక్కుకుపోయారు. గ్రామస్థులకు సమాచారంతో నిచ్చెనలు, తాళ్ల సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఆ తరువాత రైతులు కంకర, మట్టిపోసి రహదారికి మరమ్మతులు చేసుకున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పృథులగిరి సెలయేరుతోపాటు నర్సింహులువాగు, పందికుంట వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఈ వాగులు పిచ్చిరెడ్డి కుంటకు వెళ్లే దారిని దాటి వెళ్తాయి. దీంతో రహదారికి ఆరు అడుగుల లోతున పెద్దగొయ్యి ఏర్పడింది. అక్కడ చప్టా నిర్మించాలని రైతులు ఎన్నో ఏళ్లుగా అధికారులను వేడుకుంటున్నారు. కూలీలు చిక్కుకుపోయిన సందర్భంలో చప్టా నిర్మాణం కోసం అంచనాలు తయారు చేసిన అధికారులు ఆతర్వాత అటకెక్కించారు. ప్రస్తుతం పిచ్చిరెడ్డి కుంట దారి నుంచి వెళ్లేందుకు వీలులేకపోవడంతో రైతులు రేగలగడ్డ మీదుగా ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లి పంట పొలాలను చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ పనుల కోసం దూరం పెరగడంతో కూలీలు కూడా రావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయిస్తే పైర్లను కాపాడుకోగలుగుతామని అంటున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చప్టా నిర్మించాలని కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కలెక్టర్ రాజాబాబు ● మద్దులూరులో ఎమ్మెల్యే బీఎన్‌తో కలిసి మొక్కలు నాటిన కలెక్టర్ ● ఉత్సాహంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు



మొక్కలను నాటుతున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్



కొండపిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీనివల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శనివారం మద్దులూరు పంచాయతీలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుపుకుంటున్నామని, దీని ముఖ్యఉద్దేశం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమేనని చెప్పారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడిచెత్తలను వేరుచేసి కుండీల్లో వేయాలన్నారు. గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ గ్రామాల్లోని డ్రైనేజీ కాలువల్లో చెత్తచెదారం లేకుండా చేయడంలో అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇంట్లో పరిశుభ్రత పాటిస్తే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీని కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీహాల్, బస్‌షెల్టర్, స్కూల్ ప్రహరి విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో తగిన తీసుకుంటామని చెప్పారు. అనంతరం క్లాప్‌మిత్రలతో మాట్లాడారు. జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీపీవో వెంకటేశ్వరరావు, జడ్పీసీఈవో చిరంజీవి, మెప్మా పీడీ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎస్సై వి.అజయ్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు నువ్వల మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఒంగోలు(రూరల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. శనివారం ఉలిచిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూలులో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, సర్పంచ్ మంచు మురళి, చుంచు శేషయ్య, వైనరసింహారావు, చుంచు రామాంజనేయులు, నన్నపనేని చంద్రశేఖర్, చుంచు శింగయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొండపిలో అవగాహన ర్యాలీ

కొండపి: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై అవగాహన కల్పిస్తూ శనివారం కొండపిలో అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల కార్యాలయాల ప్రాంగణం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ ఇది సాగింది. ర్యాలీని కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రజాప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో చేతుల పరిశుభ్రతపై ఎంపీడీవో కార్యాలయ ఏవో రామకృష్ణ, కొండపి పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: సామూహిక పరిశుభ్రతతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. శనివారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు శుభ్రపరచి కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సమావేశ మందిరంలో ఎంపీడీవో మాట్లాడుతూ పరిశుభ్రత అనేది వ్యక్తి నుంచి, ఇంటి నుంచి ప్రారంభం కావాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వర్గీకరించే విధానం ఇంటి వద్దనే జరగాని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో దేవరపల్లి రవిబాబు, ఏపీఎం బత్తుల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మద్దిపాడులో..



మాట్లాడుతున్న ప్రసాద్, పక్కన ఎంపీడీవో జ్యోతి


మద్దిపాడు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీవో జ్యోతి అన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన శ్రద్ధ పెడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీ పర్యవేక్షకులు ప్రసాద్, ఏపీఎం కాకుమాను సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, మోహన్‌రావు, అరుణ తదతరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన డ్రైనేజీ నిర్మాణ పనులు

● కొప్పోలురోడ్డులో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించని వైనం
● పక్షపాతం చూపుతున్న అధికారులు
● కొందరివి మాత్రమే తొలగించడంపై ఆక్షేపణ

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలో కొప్పోలు రోడ్డులో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడం ఇందుకు కారణమైంది. కొందరి నిర్మాణాలు అలాగే ఉంచి మరికొందరి తొలగించి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో పలువురు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా కొప్పోలు రోడ్డులోని రైల్వే ఫ్లైఓవర్ వంతెన వద్ద గల పులి వెంకటరెడ్డి కాలనీ దగ్గర నుంచి జాతీయరహదారి ఫ్లైఓవర్ వంతెన వరకు డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు తొలగింపులో పక్షపాతం చూపారు. సిఫార్సులు, ఆర్థికబలం ఉన్నవారి నిర్మాణాల జోలికి పోలేదు. దీంతో ఇందిరకాలనీవాసులు, పులివెంటరెడ్డికాలనీ వాసులు ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు ఈ నాలుగు వరసల రోడ్డును సర్వే చేసి 20అడుగుల మేర ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి మార్కింగ్ కూడా వేశారు. ఈక్రమంలో ఆక్రమణదారులు ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి పలు సార్లు విజ్ఞప్తులు చేసుకున్నారు. దీంతో ఈ రోడ్డులో పది అడుగులు మాత్రమే ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణం కోసం అంగీకారం కుదిరింది. తదనంతరం అనుకున్నమేర ఆక్రమణలు తొలగించారు. అయితే రాజకీయ, ఆర్థికబలం ఉన్నవారి నిర్మాణాలను ఒక్క అడుగు కూడా తొలగించలేదు. అధికారులు వాటి జోలికే పోలేదు. దీంతో పలు కాలనీవాసులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. వారి పక్షపాత వైఖరిని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా కొత్తపట్నం మండలంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై జరుగుతున్న పలు ప్రచారాల నేపథ్యంలో భవిష్యత్తులో ఈ రోడ్డు ఎంతో రద్దీగా మారే అవకాశం ఉంది. దీంతో ఈ రోడ్డును పూర్తిగా విస్తరించాల్సి ఉన్నా ఆక్రమణలు తొలగించకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేజర్లలో ఉపాధి పనుల గుర్తింపు: ఏపీడీ



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్బారావు

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): చేజర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.25లక్షల పనులు గుర్తించినట్లు ఏపీడీ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం చేజర్లలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-2027 సంవత్సరానికి గ్రామస్థులు గుర్తించిన పనులు ఉపాధి పథకం కింద పూర్తి చేసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, గుర్తించిన పొలాలలో పనులు గ్రామ అభివృద్ధికి దోహదపడేలా చూడాలని చెప్పారు. జాబ్‌కార్డులు ఉన్నవారు పనులకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరరావు, టీఏ చెన్నమ్మ, బీఎఫ్‌టీ సరిత పాల్గొన్నారు.

నేడు పుస్తక ఆవిష్కరణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి అచ్యుతుని శ్రీనివాసరావు రచించిన సనాతన ధర్మక్షయము-కలి ధర్మమయము అనే పుస్తక ఆవిష్కరణ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) ఆధ్వర్యంలో ఆదివారం జరుగుతుందని రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సభలో పుస్తకాన్ని నగర కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరిస్తారని, ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ బీరం సుందరరావు పుస్తక సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే జిల్లా సాహిత్యరంగంలో కృషి చేస్తున్న ప్రముఖులకు ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. కవులు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు కాపు కార్తీక వనభోజన మహోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం ఒంగోలులోని దక్షిణ బైపాస్ రోడ్డులో గల డి6 ఎక్సోటికా ఫంక్షన్ హాలులో జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు శివపూజ, ఉసిరిచెట్టు పూజ, అతిథుల ఉపన్యాసం ఉంటుందన్నారు. అనంతరం కోలాటం, డీజే డ్యాన్స్ పిల్లలకు, మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. అందువల్ల కాపు కుటుంబ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపటి నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 17వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 వరకు అడ్మిషన్లు జరుగుతాయి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500, మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తించదన్నారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఆయా తేదీల్లో కళాశాలలో హాజరై అడ్మిషన్లు పొందవచ్చని ఆమె కోరారు.

స్వచ్ఛాంధ్ర ప్రజల జీవనాడి



మొక్కను నాటుతున్న వీసీ మూర్తి, అధ్యాపకులు

ఒంగోలు కలెక్టర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర రాష్ట్ర ప్రజల జీవనాడి అని వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమలో భాగంగా ముందుగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర కార్యక్రమం ఎంతో విశిష్టమైందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్, డీన్ జి.రాజమోహన్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు కృషి చేయాలి

మద్దిపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుష్ఠు నియంత్రణకు వైద్యసిబ్బంది కృషి చేయాలని డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. శనివారం మద్దిపాడులోని పీహెచ్‌సీలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠును ముందుగా గుర్తిస్తే నియంత్రించవచ్చన్నారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది ప్రతి గృహానికి వెళ్లి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.బాలకోటయ్య, దరియా, రజితకుమారి పాల్గొన్నారు.

ఘనంగా హీరో కృష్ణ వర్ధంతి



నివాళులర్పిస్తున్న అభిమానులు

మద్దిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో హీరో కృష్ణ వర్ధంతి కార్యక్రమం శనివారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఛైర్మన్ నట్టే సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సినీరంగంలో నూతన అధ్యాయాన్ని కృష్ణ సొంతం చేసుకున్నారన్నారు. అనంతరం నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణిజేటి గురుబాబు, జజ్జర శరత్‌బాబు, నాగేశ్వరరావు, కృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

శ్రీవారికి మేల్‌ఛాట్ వస్త్రాల సమర్పణ



వస్త్రాలను బహూకరిస్తున్న భక్తులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీ వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు మేల్‌ఛాట్ వస్త్రాలను సమర్పించారు. నగరానికి చెందిన పులిపాక వెంకటచలపతి, విజయకుమారి, వెంకట సాయి చైతన్యలు స్వామివారికి మేల్‌ఛాట్ వస్త్రాలను సమర్పించి అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి ఆశీర్వచనాన్ని, స్వామివారి శేషవస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జితసేవల ధర్మకర్త సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ.రామకృష్ణారావు, ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవసంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) జిల్లా యాదవసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దారవీడు మండలంలోని గుండంచెర్ల, మాగుటూరు గ్రామాల మధ్యన వెలసిన శ్రీవేనూతల కాటమరాజు, గంగాభవానీ అమ్మవార్ల దేవస్థానం వద్ద కార్తీకమాస వనభోజనాలు జరుగుతాయని సంతనూతలపాడు మండల కమిటీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు త్రిపురాంతకస్వామి ఆలయం నుంచి ఉచితంగా వాహనాలను ఏర్పాటు చేశామని, మండలంలోని యాదవ సోదరులు వనభోజనాలకు హాజరుకావాలని కోరారు.

స్వామిత్వ సర్వే పరిశీలన



సంతకాలను సేకరిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం స్వామిత్వ సర్వేపై డీపీవో ఎం.వెంకటేశ్వరరావు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వేలో గ్రామంలో కొలిచిన కొలతలను స్థల యజమానులు పరిశీలించుకోవాలన్నారు. ఏమన్నా తేడాలు ఉంటే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ హరిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు

ఎస్టీయూ మండల కార్యవర్గం

చీమకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం చీమకుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా అప్పనబోయిన శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తువ్వా వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించారు. పరిశీలకులుగా సంఘ రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా జిల్లా కౌన్సిలర్లుగా డి.నాగయ్య, సీహెచ్.ఎల్లయ్య, జి.పూర్ణయ్య, ఖాదర్‌బాష, నందయ్య, మల్లేశ్వరీలను, మహిళా కన్వీనర్‌గా పి.కోటమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్‌జీవో సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్

● 22న నామినేషన్ల స్వీకరణ, 29న పోలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌నాన్ గజిటెడ్ అండ్ గజిడెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్‌జీవో) ఒంగోలు తాలూకా యూనిట్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారి కే శివకుమార్ శనివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఒంగోలు యూనిట్ అధ్యక్ష, సహాధ్యక్షుడు, కార్యదర్శి పదవులతో పాటు మొత్తం 16 పదవులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఈనెల 22వతేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈనెల 23వతేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం నామినేషన్ల ఉపసంహారణ ఉంటుందని తెలిపారు. ఎన్నిక అనివార్యమైతే ఈ నెల 29వతేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుందని శివకుమార్ తెలిపారు.

17 నుంచి ఇంటర్ అర్ధసంవత్సర పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం వార్షిక ప్రణాళిక ప్రకారం ఈనెల 17నుంచి 22 వరకు అర్ధసంవత్సర పరీక్షలు నిర్వహించాలని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ ఇంటర్మీడియెట్ విద్యా కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఎవరైనా ద్వితీయ భాషకు బదులుగా ఇతర సబ్జెక్టులు ఎంపిక చేసుకుంటే వారు ఎంపిక చేసుకున్న సబ్జెక్టు పరీక్ష ఈనెల 24న నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 17న ద్వితీయ భాష, 18న ఇంగ్లీషు, 19న ఎన్‌విక్స్, 20న గణితం, బయాలాజి, హిస్టరీ, 21 ఫిజిక్స్, ఎకనామిక్స్, 22న కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరుగుతాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 17న ద్వితీయభాష, 18న ఇంగ్లీషు, 19న లెక్కలు, 20న బోటని, సివిక్స్, 20న మేథమేటిక్స్ 2బి, జువాలజీ, హిస్టరీ, 21న ఫిజిక్స్, ఎకనామిక్స్, 22న కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం పూర్తి చేసి 27వతేదీ నాటికి కళాశాలల లాగిన్‌లో మార్కులు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



ప్రశంసాపత్రాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

సమన్వయం.. సమర్థ పర్యవేక్షణ

● ఆ స్ఫూర్తితోనే తుఫాన్ విపత్తును ఎదుర్కొన్నాం
● అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానోత్సవంలో కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సమర్థ పర్యవేక్షణతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చని కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. మొంథాతుఫాన్ సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించిన తీరే అందుకు నిదర్శనమన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చురుకుగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానోత్సవం శనివారం స్థానిక రిమ్స్‌లోని ఆడిటరియంలో జరిగింది. ముందుగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ పూర్తి స్థాయిలో పనిచేయడం వల్లనే జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.ప్రజల నుంచి ప్రశంసలు పొందడంతో పాటు మీ బిడ్డలకు కూడా స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా విధుల నిర్వహణలో చూపి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ విభాగాల మధ్య మంచి సమన్వయం ఉండటం వల్ల క్షేత్ర స్థాయి ఉద్యోగులు సకాలంలో స్పందించి పరిస్థితిని త్వరగా చక్కదిద్దినట్లు చెప్పారు. కొండపిలో ఎస్ఐ చురుకుగా వ్యవహరించి 121 మంది పొగాకు కూలీలను ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సహాయంతో సురక్షితంగా తరలించడాన్ని ఎస్పీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విపత్తుల సమయంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ తుఫాన్ సమయంలో జిల్లా యంత్రాంగం శక్తిసామర్థ్యాలు నిరూపితమయ్యాయని తెలిపారు. దీనిని ఒక అనుభవంగా తీసుకొని ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధికారులు, ఆర్డీవోలతో పాటు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీలు శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

స్పాసెంటర్‌పై పోలీసుల దాడి

● అదుపులో ఐదుగురు

ఒంగోలు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్పాసెంటర్‌పై దాడి చేసి యజమానితోపాటుగా ఇరువురు యువతులు, ఇరువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం స్థానిక పోలేరమ్మ ఆలయం సమీపంలో సోనుస్ బ్యూటీ పార్లర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. అక్కడ ఇరువురుయువతులు, ఇరువురు యువకులు ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పార్లర్ నడుపుతున్న యజమాని పి.సురేష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి ఐదుగురినీ వన్‌టౌన్‌పోలీసులకు అప్పగించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

● మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల్లో వక్తలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమరశీల పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తోందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కార్మికుల జీవితాలు మారాలంటే ప్రజా పోరాటాలు తప్పవన్నారు.ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) 15వ రాష్ట్ర మహాసభలు శనివారం ఒంగోలులో ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్త మార్కెట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే నాగభూషణం అధ్యక్షతన జరిగిన సభలో శాసనమండలి సభ్యుడు బొర్రా గోపి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన ఉద్యోగ, కార్మిక, కర్షకుల జీవితాల్లో మార్పులు రావడం లేదన్నారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందాలని, కనీస వేతనం అమలు చేయాలని, తమ సేవలను ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయాలని కార్మికులు కోరుకుంటుంటే ఈ ప్రభుత్వాలు వీటి అమలుకు ముందుకు రాకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారి వర్గాల ప్రయోజనం కోసం చట్టసభల్లో కృషి చేస్తున్నాయని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ప్రజా సమస్యలను పక్కన పెట్టి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 175 మంది సభ్యులు ఉన్న శాసనసభలో వైసీపీ వాకౌట్ చేసింది తప్ప వ్యతిరేకంగా ఓటు చేయకపోవడం వెనుక కార్పొరేట్ వర్గ స్వభావం వ్యక్తం అవుతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నప్రైవేటీకరణ విధానాలను పోరాటాల ద్వారానే తిప్పికొట్టగలమని స్పష్టంచేశారు. కష్టజీవుల ప్రయోజనాల కోసం కాపాడే కేరళ తరహా పాలన కోసం కార్మిక, కర్షక సమరశీల పోరాటం నిర్మించాలన్నారు. మునిసిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాడు విజన్- 2020 పేరుతో ప్రజలను మోసగించిన చంద్రబాబు నేడు విజన్ 2047 పేరుతో మరోసారి దగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సభలో యూనియన్ నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఎం. రమేష్, కాలం సుబ్బారావు, జీవీ కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, పి. కల్పన, కే సామ్రాజ్యం, నూకరాజు, పి. వెంకటరెడ్డి, ఎన్‌వై నాయుడు, వరికూట రాజు, ముత్యాలరావు, కే పెంచల నరసయ్య, జ్యోతిబసు టి. మహేష్, కే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు


మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

ఒంగోలులో భారీ ర్యాలీ

రాష్ట్ర మహాసభల సందర్భంగా ఒంగోలులో యూనియన్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మునిసిపల్ కార్మిక సంఘం నేతలు, కార్మికులు మహాసభల సూచకంగా జెండాలు చేతపట్టిన మహిళా కార్యకర్తలు ముందు భాగంలో నిలిచారు. ఈ ర్యాలీ మునిసిపల్ కార్యాలయం నుంచి కొత్త మార్కెట్ సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వందలాది మంది మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.


శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

కమనీయం చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి శనివారం శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆధ్వర్యంలో రంగాచార్యులు సాయికుమారాచార్యులు చెన్నకేశవ స్వామి మూల వీరాట్‌కు అభిషేకాలు, అలంకరణ అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో నిత్యపూజలందుకునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను కళ్యాణ పీఠంపై సోభయమానంగా అలంకరించి వేంచేపు చేశారు. మంగళవాయిద్యాలు వేదమంత్రాలనడుమ కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న దేవుడి ఆభరణాలు (ఇన్‌సెట్లో) వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

దేవుడి ఆభరణాల చోరీ నిందితుల అరెస్టు

● సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి విగ్రహంపై ఉన్న వెండి ఆభరణాలను చోరీ చేసిన నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. దొంగకు సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేసి, వారి నుంచి వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు వివరాలను వెల్లడించారు. గత నెల 23వ తేదీన గిద్దలూరు పట్టణం రాచర్ల రోడ్డులోగల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్ధరాత్రి స్వామి వారి ఒంటిపై ఉన్న సుమారు 10 కిలోల వెండి ఆభరణాలను దొంగ దోచుకెళ్లాడు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి గుంటూరు జిల్లా అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వడ్లమాను శివారెడ్డి, అదే జిల్లాలోని పొన్నూరుకు చెందిన జెట్టిబోయిన ప్రవీణ్, జెట్టిబోయిన ప్రదీప్ అనే నిందితులను పట్టణ సమీపంలోని కొత్తపల్లె గ్రామంలో అరెస్టు చేసి వారి వద్ద ఉన్న వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులలో వడ్లమాను శివారెడ్డి అనే వ్యక్తిపై ఇప్పటికే పలు కేసులు ఉండగా, గంజాయి అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు. ఈ నిందితులపై సుమారు 40 నుంచి 50 కేసులు ఉన్నట్లు తెలిపారు. వడ్లమాను శివారెడ్డి వద్ద స్వామి వారి 5 కిలోల వెండి, 1500 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జెట్టిబోయిన ప్రవీణ్ వద్ద 2 కిలోలు కరిగించిన వెండి ముద్దలు 3, సెల్‌ఫోన్, శివారెడ్డి ఇచ్చిన వెండి కరిగించే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యం ప్రదర్శించిన గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్, ఒంగోలు సీసీఎస్ సుధాకర్, ట్రాఫిక్ సీఐ జగదీష్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

జిల్లాపై అలసత్వం ప్రదర్శిస్తే మరో ఉద్యమం

● మార్కాపురం జిల్లా సాధన సమితి నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి నాయకులు

మార్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లాపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తే మరో ఉద్యమం తప్పదని మార్కాపురం జిల్లా సాధన సమితి నాయకులు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం డీకేఎం రఫి అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో సాధన సమితి నాయకులు మాట్లాడారు. సాధన సమితి కన్వీనర్ షేక్ సైదా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు ప్రకాశం జిల్లాలో పర్యటిస్తూ మార్కాపురంను జిల్లా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే పశ్చిమంలో తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. గత వైసీపీ పాలనలో ప్రకాశం జిల్లాలోని నాయకుల స్వార్థంతోనే మార్కాపురం జిల్లాగా కాలేకపోయిందన్నారు. అప్పట్లో 65 రోజులపాటు జిల్లా కోసం ఉద్యమం జరిగిందన్నారు. ఆనాడు కీలకపాత్ర పోషించిన కూటమి నాయకులు ముందుకు రావాలన్నారు. సమితి కోకన్వీనర్ అందె నాసరయ్య మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పాటుకు సానుకూలత ఉన్నప్పటికీ మంత్రివర్గ ఉపసంఘం చేసిన నిర్ణయాలను ఈ నెలలో జరిగిన క్యాబినెట్‌లో ఆమోదించలేదన్నారు. ఇటీవల కనిగిరిలో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లా ఊసే ఎత్తకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం ఇదే విధంగా నాన్పుడి ధోరణి అవలంబిస్తే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో డి.సోమయ్య, సుదర్శన్, రజాక్, ఖాశిం, షేక్ ఇమ్రాన్, గుమ్మా బాలనాగయ్య, గాలి వెంకటరామిరెడ్డి, పి.రూబెన్, షేక్ మహబూబ్‌వలి పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం ఆకస్మిక తనిఖీ


వంటశాలను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి బాలాజీ

మార్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహాన్ని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బాలాజీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పరిసరాలను, విద్యార్థినుల గదులు, స్టోర్‌రూం, వంటశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. హాస్టల్‌లో అపరిశుభ్రత ఉండటాన్ని గమనించి వార్డెన్‌ను మందలించారు. మళ్లీ ఒకసారి తనిఖీకి వస్తానని అప్పటికి పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. అంతేకాక విద్యార్థినులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల లీగల్ అథారిటీ సర్వీస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు అన్వర్‌బేగ్, ఉష శ్రీ, పారా లీగల్ వలంటీర్లు బాషా, ఆదినారాయణ, పవన్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లను కారుతో ఢీకొట్టిన దొంగ

● ఒకరికి గాయాలు
● తప్పించుకున్న మరొకరు


కారుతో ఢీ కొట్టడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రసూల్

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 100 డయల్‌కి వచ్చిన ఫిర్యాదుతో కారును ఆపి విచారిస్తుండగా కారులో ఉన్న దొంగ కారుతో పోలీసులపైకి దూసుకుపోగా ఒకరికి గాయాలు అయ్యాయి. మరొకరు త్రుటిలో తప్పించుకున్నారు. అందిన సమాచారం మేరకు.. పట్టణ శివారులో శనివారం బ్లూఫోర్స్ డ్యూటీలో ఉన్న షేక్ నాయబ్ రసూల్, సయ్యద్ ఖాజాపీరా కానిస్టేబుళ్లు డ్యూటీలో ఉండగా, 100కు వచ్చిన ఫిర్యాదు నిమిత్తం అటుగా వెళ్తున్న కారును ఆపి ప్రశ్నిస్తున్నారు. ఒంగోలు నుంచి దొంగతనం చేసి కారులో వస్తున్న రఫి అనే వ్యక్తిని ప్రశ్నిస్తున్న సమయంలో ఆ వ్యక్తి కారును పోలీసుల పైకి స్పీడుగా పోనిచ్చాడు. కారు పక్కన ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక్కసారిగా కిందపడిపోగా ఖాజాపీరా పక్కకు తప్పించుకోగా షేక్ నాయబ్ రసూల్‌కు కాలిపై తీవ్రగాయం అయింది. రసూల్ కిందపడిపోవడంతో కారులో ఉన్న రఫి కారుతోపాటు పరారయ్యాడు. గాయపడిన కానిస్టేబుల్ షేక్ నాయబ్‌రసూల్‌ను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీపురు పట్టిన పోలీసులు

ఒంగోలు క్రైం,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో పోలీసులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసు స్టేషన్‌ల పరిసరాలను శుభ్రం చేశారు. ఒంగోలు జిల్లా పోలీసుకార్యాలయం పరిసరప్రాంతాలలో ఉన్న చెత్తను తొలిగించడంతో పాటు మురుగు నీరుబయటకు పంపేందుకు చర్యలు తీసుకున్నారు.మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తున్న ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. అదే విధంగా పిచ్చిమొక్కలను తొలిగించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో ఎస్పీ వి.హర్షవర్ధన రాజు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. సమాజంలో శాతియుత వాతవరణం, పరిశుభ్రమైన వాతవరణం రెండూ సమానంగా భావించి పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● డీఎఫ్‌వో శివతేజ

ఒంగోలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ఉపయోగించుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని సముపార్జించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివతేజ పేర్కొన్నారు. ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాలలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం శివతేజ మాట్లాడుతూ ప్రస్తుత సెల్‌ఫోన్ యుగంలో పుస్తక పఠనం తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే పుస్తకం చదవటం ద్వారా విషయ పరిజ్ఞానం అలవరడమే కాకుండా చదివిన విషయం ఎప్పటికీ మనసులో ఉండిపోతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారి రజనీకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు ఎంతో కీలకపాత్ర పోషించాయని, వాటిని ఉపయోగించుకుని నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధంకావచ్చని పేర్కొన్నారు. అనంతరం జరిగిన నృత్య పోటీలలో పలువురు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ నృత్య శిక్షకురాలు శ్వేత న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అదేవిధంగా విద్యార్థులకు పాటల పోటీలు, ఫ్యాన్సీ డ్రస్, ర్యాంప్ వాక్ పోటీలను నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు జి.గురవారెడ్డి, ఆర్.సదానందరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బంతికట్ల నాగేశ్వర రావు, డాక్టర్ మధుర్రశీ, పాఠకులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న డీఎఫ్‌వో శివతేజ

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గిద్దలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



పెద్దారవీడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎరిక్షన్‌బాబు



మార్కాపురంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- స్వచ్ఛాంధ్రలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- రూ.15 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.2 కోట్లతో వాకింగ్ ట్రాక్, పార్కుల అభివృద్ధి

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పట్టణంలోని పొట్టిశ్రీ రాములు సెంటర్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని అధికారులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేశారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలో రూ.15కోట్లతో సీసీ రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. ప్రజల సౌకర్యార్థం రూ.2కోట్లతో వాకింగ్ ట్రాక్‌తో కూడిన పార్కు, చిల్డ్రన్ పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు ఛైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ ఛైర్మన్ గోడి ఓబులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇ.వి.రమణబాబు, తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, బిల్లా రమేష్, రమేష్, చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ ఎం.శివరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛ అంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దోర్నాల బస్టాండ్, తర్లుపాడు రోడ్డులోని బాలికల వసతి నివాసంలో వ్యక్తిగత పరశుభ్రత, సామాజిక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలలకు బాలికలకు, అ వగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ పీవీఎస్ నారాయణరావు మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికి సాహకారం అం దించాలన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై కాలువల లో చెత్త వేయరాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ య్య, పా ల్గొన్నారు.

పెద్దారవీడు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, పారిశుధ్య సిబ్బంది, ప్రజలతో పరిశుభ్రతకు సంబంధించి ప్రతిజ్ఞన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్ర భుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యక్తిగత ఆరో గ్యాం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్‌సుందరం, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గొట్టం శ్రీనివాసులరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో ఏ బాలచెన్నయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై వీవోఏలు, స్వయం సహాయక సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డీ పిచ్చయ్య, సీసీలు, వీవోఏలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో రాజ్‌కుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విఓఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి 250 కుటుంబాలకు ఒక క్లాప్‌మిత్ర ఉన్నారని వారంతా ప్రజలకు తడిపొడి చెత్తను వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురళి, ఏపీఎం ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పొందాలని డివిజనల్ అంచాయతీ అధికారి సుబ్బరావు అన్నారు.శ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు, కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాచర్ల : విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను పాటించాలని వసతి గృహం సంక్షేమ అధికారి ఎస్ మురళి అన్నారు. అనుములవీడు ప్రాథమిక వైద్యశాల సిబ్బంది సహకారంతో శనివారం ఆయనబీసీ వసతిగృహంలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వై రంగనాయకులు ఏఎన్‌ఎం షమీం, ఆశ వర్కర్లు కుమారి, విజయ కుమారి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం వల్ల మేధస్సు పెరుగుతుందని గ్రంథపాలకురాలు కే జాన్సీ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, పఠనం, గ్రంథాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఖాసింబాషా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాచర్ల : స్వచ్ఛ ఆంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేద్దామని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరె డ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, ఎంఈవో వి గిరిధర శర్మ, వెలుగు ఏపీఎం కె నరేష్, హెచ్‌ఎం బీఎల్ రామానాయక్, కార్యాలయ సిబ్బంది స్వామి రాజ్ కుమార్, కార్యదర్శి అనిల్ కుమార్, మహిళా సమాఖ్య సభ్యులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న న్యాయాధికారులు

డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. శనివారం పోలీసు, బ్యాంక్, టెలిఫోన్ అధికారులకు న్యాయవాదులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ సమయం, ధనం ఆదా చేసుకుని రాజీ మార్గమే రాజమార్గమని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పా లుగుళ్ల శేషశైనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎ.తిరుమలప్రసాద్, గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలు కె.సురేష్, జె.రామకోటయ్య, అర్ధవీడు, బేస్తవారపేట, కంభం ఎస్సైలు ఎం.శివనాంచారయ్య, రవీంద్రరెడ్డి, బి.నరసింహారావు, ఎక్సైజ్ ఎస్సైలు జాన్సన్, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జన్మదిన వేడుకలు

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి నాయకుడు భగవాన్ బిర్సా ముండా జ యంతి సందర్భంగా ఆ యన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బరాయుడు, పుల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నున్నా వీరచక్రం, నాయకులు గుమ్మా రాముడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాచర్ల కాసులు, సిదర్ల రమేష్ పాల్గొన్నారు.

పుస్తకాల విలువ తెలుసుకోవాలి



విద్యార్థులతో కలసి పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

త్రిపురాంతకం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తకాల విలువ వాటి ప్రాధాన్యతను తెలుసుకోవాలని గ్రంథపాలకులు రామాంజినాయక్ విద్యార్థులకు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల నాసరయ్య ఉపాధ్యాయులు ఏడుకొండలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గిద్దలూరు : శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయగా పాఠకులు పెద్ద ఎత్తున హాజరై పరిశీలించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంచుకోవచ్చని పలువురు పేర్కొన్నారు. బాలబాలికలకు చదరంగం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో మహిత, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : విద్యార్థులు పుస్తకాలు చదివి విజ్ఞానం, మేధాశక్తిని పెంచుకోవాలని ఎపీఈడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవో వీ గిరిధరశర్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథపాలకుడు పి శ్రీధర్‌రెడ్డి శనివారం జన్మభూమి భవనంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వారు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, జడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం బీఎల్ రామానాయక్, పంచాయతీ కార్యదర్శులు నాయక్, సు రేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : పుస్తక పఠనం నైపుణ్యాల అభివృద్ధిలో కీలకం అని సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం ఆయన పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.వీరారెడ్డి, గోపాలుని శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి జీవి.శివారెడ్డి, కార్యక్రమాల ఇన్‌ఛార్జ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని తెప్పోత్సవం



తెప్పోత్సవంలో స్వామివారు

తర్లుపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామికి తర్లుపాడు చెరువులో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కారంపూడి వెంకటరమణాచార్యులు ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఉభయదేవేరులతో స్వామిని మంగళవాయిద్యాలతో చెరువు వద్దకు తీసుకెళ్లి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. వేణుగోపాలుడు మాహావిష్ణువు అలలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 50 ఏళ్ల తర్వాత తెప్పోత్సవం నిర్వహించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకొని తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, ఈవో ఈదుల చెన్నకేసులరెడ్డి, తహసీల్దార్ కేకే కిషోర్‌కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలీ సీఐ రాజ్‌కుమార్, తర్లుపాడు, కొనకనమిట్ల ఎస్సైలు బ్రహ్మానాయుడు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, టూరిజం శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు

రాచర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో గల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుం డి రాకేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేష్ దంపతులు నిర్వహించిన సుదర్శన హోమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో నాగయ్య ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఛైర్మన్ రాకేష్‌లకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, మండల మాజీ జడ్‌పిటిసి కుప్ప రంగనాయకులు, రాచర్ల సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్‌ఛైర్మన్ బైలడుగు బాలయ్య, బీజేపీ నేత పిడతల రమేష్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు ప్రశంసాపత్రాల అందజేత



కలెక్టర్ రాజాబాబు నుంచి అవార్డులు తీసుకుంటున్న మార్కాపురం కమిషనర్ నారాయణరావు

మార్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమ యంలో అత్యుత్తమ సేవలందించిన మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శనివారం ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.నారాయణరావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మొంథా తుపాన్‌లో విశేష సేవలందించిన తహసీల్దార్ చిరంజీవికి కలెక్టర్ రాజబాబు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆయనతోపాటు భూపతిపల్లి పంచాయతీ సెక్రటరీ షేక్ ఖాశిం, పెద్దనాగులవరం వీఆర్వో కల్యాణి కూడా అవార్డులు పొందారు.

గిద్దలూరు టౌన్ : మొంథా తుఫాన్ సమయంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లో చెరువులు దెబ్బతినకుండా ప్రయత్నించిన వర్క్ ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్‌యాదవ్‌ను కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందించారు.



అవార్డు పొందుతున్న గిద్దలూరు వర్క్‌ఇన్‌స్పెక్టర్ శేఖర్‌యాదవ్

బేస్తవారపేట : తుఫాన్ స మ యంలో ప్రజలను అప్రమ త్తం చేయుడంతోపాటు సహా య చర్యల్లో చురుగ్గా పాల్గొన్న తహసీల్దార్ ఏ జితేంద్రకుమార్‌కు కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆయనతోపాటు గ్రామ రెవెన్యూ అధికారి చెన్నమ్మ, సహాయకుడు షేక్ మౌలాలి కూడా అవార్డును అందుకున్నారు.



అవార్డును అందుకుంటున్న బేస్తవారపేట తహసీల్దార్ జితేంద్రకుమార్

త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

కొమరోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గృహ లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆ సంస్థ గిద్దలూరు డిప్యూటీ డీఈ ఖదీర్‌బాషా తెలిపారు. మండలంలోని దద్దవాడ, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లోని గృహ లబ్ధిదారులను శనివారం కలిసి త్వరగా గృహాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రూరల్ గ్రామాల్లో ఇళ్ల మంజూరుకు ఆవాస్ యోజనా-2025 సర్వే ఈనెల 30వ తేదీ లోపు పూర్తవుతుందన్నారు. సచివాలయాల్లో ఉండే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సర్వేయర్‌గా నియమించినట్లు తెలిపారు. జాబ్ కార్డులు లేని లబ్ధిదారులకు వెంటనే జాబ్ కార్డును మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లాలోని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన రూరల్ హోప్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా గిద్దలూరులోని కోటగడ్డవీధిలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి గుంటూరు జిల్లాలోని శంకర వైద్యశాలకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తారని వారు తెలిపారు.

నేడు కార్తీక వనభోజనాలు

బేస్తవారపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోక్షగుండం ముక్తేశ్వర ఆలయంలో కార్తీకవనభోజనాలు ఆదివారం 10 గంటలకు జరుగుతాయని కొండా రఘునాథరెడ్డి, అక్కపల్లె మాజీ సర్పంచ్ కొండా వెంకటరెడ్డి తెలిపారు.

ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలి

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సచివాలయాలకు వెళ్లి వినతిపత్రాలను అందచేశారు. 3 నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లలో ఉండేలా జీవో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మున్నా, అంగన్‌వాడి కార్యకర్తలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, మహబూబ్‌బీ, కాశమ్మ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి



కొమరోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీ సద్గుణరావు (60) అనారోగ్య సమస్యతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. వారం రోజులుగా ఆయన విజయవాడలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాన్ని ఒంగోలులోని తమ స్వగృహానికి తీసుకుకొచ్చారు. సద్గుణరావు ఈ ఏడాది మేలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఒంగోలులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుం బ సభ్యులు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మృతిపట్ల అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

నాదెళ్లకు కన్నీటి వీడ్కోలు



ఎన్‌ఎస్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖులు ఎన్‌ఎస్ విద్యా సంస్థల వ్యవస్థాపక అధినేత నాదెళ్ల సుబ్రహ్మణ్యం పార్థివదేహానికి శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. స్థానిక అరవింద ఘోష్ వీధిలోని నాదెళ్ల సుబ్రహ్మణ్యం నివాసం నుంచి ఆయన పార్థివ దేహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర నిర్వహించారు. పలువురు ప్రముఖులు వివిధ సంఘాల నాయకులు పురప్రజలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. స్థానిక సాయిబాలాజీ థియేటర్ సమీపంలోని సత్యహరిచంద్ర శ్మశాన వాటికలో ఆయన కుమారుడు నాదెళ్ల చంద్రమౌళి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని వినియోగదారుల సంఘ భవనంలో సంఘ సభ్యులు సమావేశమయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా లియాకత్‌అలీ, కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకటస్వామి, కాశిరెడ్డి, కోశాధికారిగా గుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీసీల సమగ్ర కులగణన చేయాలి



అభివాదం చేస్తున్న శ్వేత, సభ్యులు

గిద్దలూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ జనాభా దామాషా మేరకు చట్టబద్ధత, రిజర్వేషన్లు అమలు అయ్యేలా ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కులగణన జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత అన్నారు. శనివారం స్ప్రింగ్ బోర్డ్ పాఠశాల ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్వేత మాట్లాడుతూ బీసీ జనగణన, వర్గీకరణ జరగకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సరికాదని హైకోర్టులో వ్యాజ్యం వేశారన్నారు. బీసీ కులాల్లోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం దక్కాలంటే స్థానిక సంస్థలకు సంబంధించి రిజర్వేషన్, వర్గీకరణ జరగాలని అన్నారు. సమావేశంలో పలువురు బీసీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

అచ్యుత్‌రెడ్డికి నివాళి

పెద్దదోర్నాల నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన ఐటీడీపీ నాయకుడు అన్నపురెడ్డి అచ్యుత్‌రెడ్డి (47) శుక్రవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం అచ్యుత్‌రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ బాబు, నాయకులు దొడ్డ శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేవయ్య, బాబు, ఎలకపాటి చెంచయ్య పాల్గొన్నారు.



అచ్యుత్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పామూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతిలో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద శనివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో విరివిరిగా మొక్కలు నాటి పామూరును హరిత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వై.బాల, జి. శ్రీనివాసులు, బి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నారాయణస్వామి దేవస్థానంలో మహాపుష్పయాగం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో నారాయణస్వామి, శ్రీదేవి -భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివార్లకు కార్తీక మాసం సందర్భంగా ఆదివారం మహాపుష్పయాగం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొనాలని శనివారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

పీసీపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, స్థానిక నాయకులు రామయ్య, వీరయ్య, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంగయ్య, ఎబినేజరు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానంలో నిత్యఅన్నదానం ప్రారంభం

పామూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. తొలిరోజు భక్తులకు పామూరు మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు, టీడీపీ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు సౌజన్యంతో ఏర్పాటుచేసిన భిక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ వెంకటరాజు, జయరామిరెడ్డి, ఓగూరి నరసింహారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. కుటుంబం, సమాజ శ్రేయస్సును దృష్టిలో మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలన్నారు. ప్రతి నీటి బిందువును ఒడిసి పట్టుకుని వృథా కాకుండా చూడాలన్నారు. సమతులమైన వాతావరణం మొక్కలతోనే సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ హైస్కూల్ ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

కార్యక్ర మంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎంఈవో యూవీ నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, నాయకులు పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, ఐవీ నారాయణ, నజీముద్దీన్, బాలు ఓబులురెడ్డి, జంషీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గోతులమయమైన నూజెండ్లపల్లి - సుంకరవారిపాలెం రహదారి



అధ్వానంగా ఉన్న లక్ష్మీనగర్ - పెద ఉల్లగల్లు రహదారి

ముండ్లమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. గుంతలుపడిన రోడ్లలో వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. గత వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాల కాలంలో రహదారులపై తట్ట మట్టిపోసిన పాపాన పోలేదు. ప్రజాప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేస్తారని ఆశించినా ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలోని పెద ఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్ వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా ఉంది. మూడు కిలో మీటర్లు ఉండే ఈ రహదారి గోతులమయమైంది. వాహన చోదకులు నిత్యం గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో మరింత అధ్వానంగా మారింది. తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అలాగే, నూజెండ్లపల్లి, భట్లపల్లి, సుంకరవారిపాలెం రహదారి గత పది సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోలేదు. అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు చిట్ల చెట్లు దట్టంగా పెరిగి రహదారులను కమ్మేశాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం అరగంట పట్టే ప్రయాణం గంట నుంచి గంటన్నర పడుతుందంటే ఈరహదారి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి ఈరెండు రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రయాణం సజావుగా సాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చిస్తున్న సుదేన్షసేన్

రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్‌ఎం

దొనకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేన్షసేన్ శనివారం తనిఖీ చేశారు. డీఆర్‌ఎం ప్రత్యేక రైలులో దొనకొండకు విచ్చేసి అమృత్ భారత్ పథకంలో బాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని గురించి అధికారులతో చర్చించారు. ఆమె వెంట రైల్వే డివిజనల్‌స్థాయి ఉన్నతాధికారులు ఉన్నారు.

పోతవరంలో భక్తుల కోలాహలం

- వైభవంగా శిల, కలశ ప్రతిష్ఠలు

వీసీపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం గ్రామం శనివారం భక్తుల కోలాహలంతో సందడిగా మారింది. నూతనంగా నిర్మించిన పోలేరమ్మ, బంగారమ్మ ఆలయాల్లో శనివారం శిలాప్రతిష్ఠ, శిఖరంపై కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక యాగశాలలు ఏర్పాటుచేసి ఋత్వికులు హోమాలు, వేదపారాయణాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిల, శిఖరంపై కలశ ప్రతిష్ఠ చేశారు. మూడురోజుల నుంచి జరుగుతున్న ఈకార్యక్రమంలో చివరి రోజైన శనివారం ఉదయం నుంచి గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



ఆలయ శిఖరంపై ప్రతిష్ఠిస్తున్న కలశం



ప్రతిష్ఠ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన భక్తులు



వృద్ధులకు అందుతున్న వైద్య సేవలపై విచారిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజాక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలోని ప్రజానీకం ఆరోగ్యంగా ఉండాలనేది తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జనని కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణా సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులకు ఎలా ఉందంటూ పలకరించారు. వృద్ధులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కంటి శస్త్రచికిత్స కోసం గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి వెళ్ళినపుడు అక్కడ వైద్యుల సేవలు ఎలా ఉన్నాయని వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరానికి 168 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారికి శంకర కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుప్రియ కంటి పరీక్షలు చేశారు. వారిలో 32 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా నిర్ధారించారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి శిబిరంలో కంటి అద్దాలు, చుక్కలు మందులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి సుజాతను సన్మానించిన భైరవకోన దేవస్థాన అధికారులు

భైరవకోనను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని భైరవకోన క్షేత్రాన్ని హైకోర్టు జడ్జి సుజాత శనివారం సందర్శించారు. ఆలయంలోని త్రీముఖ దుర్గాదేవి అమ్మవారిని, నగరేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అభిషేక పూజలు, కుంకుమార్చన పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కనిగిరి జూనియర్ కోర్టు న్యాయాధికారి బి.రూపశ్రీ, ఆలయ చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు, ఈవో వంశీకృష్ణారెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ముండ్లమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. శనివారం ముండ్లమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఏరియా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, హెచ్‌ఎం మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కె.రాధ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సామంతపూడిలో శనగ, మొక్కజొన్న పంటలు సాగుచేసిన రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగుచేసే రైతులు ముందుగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

పామూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఎస్ సభ్యులు తమ పరిధిలోని 60 కుటుంబాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని బుక్కాపురం, బోడవాడ గ్రామంలో జరిగిన సమావేశంలో కేఎస్‌ఎస్ సభ్యలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎం.రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై నిరంతర నిఘా

తాళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరంలో శనివారం మనగ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువుల శ్యాంపిల్స్‌ను తీసి పరీక్షల నిమిత్తం రీజనల్ కోడింగ్ కేంద్రానికి పంపుతున్నట్టు చెప్పారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. రైతులకు నకిలీ మందులు అమ్ముతున్నట్లు నిర్ధారణ అయితే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పశువుల మేత భూములను ప్లాంట్‌కు ఇవ్వొద్దు!

పామూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడు, తిరగళదిన్నె రెవిన్యూ పరిధిలోని పశువుల మేత భూములు, ఏడబ్ల్యూ భూములను బయోగ్యాస్ ప్లాంట్‌కు ఇవ్వొద్దని కోరుతూ శనివారం నుచ్చుపొద గ్రామ సచివాలయంలో వీఆర్వో చెన్నవేశవులకు వినతి పత్రం అందజేశారు. తూర్పుకోడిగుడ్లపాడు, తిరగళదిన్నె, చిలకపాడు గ్రామంలోని పశువులమేత భూములు ఇచ్చేందుకు శనివారం గ్రామ సభ నిర్వహించారు. సభలో పాల్గొన్న గ్రామస్థులు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొలనీడి రామకృష్ణ, బత్తుల మురళీకృష్ణ, ప్రసాద్, పోకా హరికృష్ణ, చిన మాలకొండయ్య, పోతుల రమేష్‌బాబు, మాల కొండయ్య, బి.సుధాకర్, కౌలూరి హజరత్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

తాళ్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని ఎంపీడీవో పి.అజిత అన్నారు. మండలంలోని మన్నేపల్లి పంచాయతీ పరిధిలోని దారంవారిపాలెంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సచివాలయ ఆవరణలో పలురకాల మొక్కలు నాటారు. కార్యక్రమలో సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీఎంపీడీవో నాగమల్లేశ్వరి, ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మొలకయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది పనులు వేగవంతం చేయాలని కనిగిరి డీడీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బసిరెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, కాలనీలకు చేసుకున్న దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అంతకముందు మండలంలోని వెంకచలంపల్లి, చందలూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలబిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు

దర్శి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ సమయంలో విశేష సేవలందించిన దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌కు ఉత్తమ అవార్డు లభించింది. కలెక్టర్ రాజాబాబు చేతులమీదుగా శనివారం తహసీల్దార్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తుఫాన్ సందర్భంగా ప్రజలకు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడినందుకు సంతోషంగా ఉందన్నారు. తమ సేవలను గుర్తించి అవార్డు లభించడం ఆనందదాయకమన్నారు.

పీసీపల్లి: మొంథా తుఫాన్ నేపథ్యంలో చేపట్టిన సహాయక చర్యల్లో విశేష సేవలందించిన పెదయిర్లపాడు వీఆర్వో షేక్ రఫీఅహ్మ ద్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు శనివారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. తుఫాన్ సందర్భంగా తన రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందించిన సహాయ కార్యక్రమాలు, చేపట్టిన ముందస్తు చర్యలను కలెక్టర్ ప్రశంసించారు.

ముండ్లమూరు: మొంథా తుఫాన్ సమయంలో నాయుడుపాలెం వీఆర్‌వోగా చల్లా బ్రహ్మతేజ సేవలకు కలెక్టర్ ప్రశంసా పత్రం అందజేశారు. ఒంగోలులో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తుఫాన్ సమయంలో వరదలకు చిలకలేరు వాగు పొంగిప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చేసినం దుకు అవార్డు అందజేశారు.

పామూరు: మొంథా తుఫాన్ ప్రభావ సహాయక చర్యల్లో పాల్గొని ఉత్తమ సేవలు అందించిన పలు శాఖ అధికారులకు ఒంగోలులో శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీటిని అందుకున్నవారిలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, విద్యుత్‌శాఖ ఏఈ షేక్ జిలాని, వీఆర్వో జక్కా సరస్వతి, పంచాయతి కార్యదర్శి ఓ.లక్ష్మి ఉన్నారు.

తాళ్లూరు: ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ సందర్భంగా సహాయక చర్యలు అందించడంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన తహసీల్దార్ బీవీ రమణారావు, శివరాంపురం వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు శనివారం ఉత్తమ సేవ అవార్డులను అందుకున్నారు. కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతులు మీదుగా అందుకున్నారు.

దొనకొండ: మొంథా తుఫాన్ సమయంలో తహసీల్దార్ బి.రమాదేవి, దొనకొండ-2 వీఆర్వో మాచర్ల సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టడంతో ఉత్తమ అవార్డులు లభించాయి. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుల చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు.



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న దొనకొండ తహసీల్దార్ రమాదేవి, దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పామూరు ఎంపీడీవో బ్రహ్మయ్య, తాళ్లూరు తహసీల్దార్ బీవీ రమణారావు



చేతులు శుభ్రత ఆరోగ్యానికి భద్రత అనే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు



- కోటప్పకొండ అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయాలి
- పర్యాటక అభివృద్ధిపై కలెక్టర్ కృతికా శుక్లా సమీక్ష

అమరావతిలో బుద్ధుని విగ్రహం ఆధునికీకరణ

నరసరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని 125 అడుగుల బుద్ధుని విగ్రహాన్ని ఆధునికీకరించనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కోటప్పకొండ అభివృద్ధిపై డీపీఆర్ సిద్ధం చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లాలోని పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై ఆమె సమీక్షించారు. పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, భవిష్యత్తు మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనపై చర్చించారు. పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్‌లో భాగంగా సాగర్ వద్ద వరల్డ్ క్లాస్ బుద్ధిస్ట్ హెరిటేజ్ సెంటర్, గుత్తికొండ బిలం రహదారి, ఎత్తిపోతల వాటర్ ఫాల్స్ వద్ద జిప్ సైకిల్, జిప్ లైన్ పనులు పురోగతిని తెలుసుకున్నారు. నాగార్జునసాగర్ వద్ద టెంట్ సిటీ, బుద్ధిస్ట్ అకాడమీ, కొండవీడు ఘాట్ రోడ్డు ప్రారంభం వద్ద పర్యాటక వసతి భవనం నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమరావతి పట్టణంలోని నూనె గుండం చెరువు, కాలచక్ర మ్యూజియం అభివృద్ధికి నిధులు సమీకరణ, వాటిని త్వరితగతిన ఆధునికీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కోటప్పకొండ అభివృద్ధికి పర్యాటక శాఖ ద్వారా 'సాస్కి' స్కీం నిధులు తీసుకొచ్చేందుకు.. దైద బిలం పర్యాటక అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య, జిల్లా అధికారి నాయుడమ్మ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ శ్రీనివాసరావు, కోటప్పకొండ ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీ పాలన ప్రక్షాళన

పంచాయతీల పాలనను ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంది. పాలన విధానంలో మార్పులు తీసుకొచ్చింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ పాలనకు ముగింపు పలికింది. దీని స్థానంలో పంచాయతీలకు గ్రేడ్‌లు కేటాయించింది. ఆదాయం, జనాభా ఆధారంగా ఈ గ్రేడ్‌ల విధానం అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం అధికార సిబ్బందిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లాలో 529, గుంటూరు జిల్లాలో 257, బాపట్ల జిల్లాలో 461 పంచాయతీలకు గ్రేడ్‌లు కేటాయించారు.



అమలులోకి.. గ్రేడింగ్ విధానం

- మున్సిపాలిటీ తరహాలో విభాగాలు
- ఉమ్మడి జిల్లాలో 42 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్
- పంచాయతీ అభివృద్ధి అధికారులుగా కార్యదర్శులు
- మరింత చేరువగా ప్రజలకు సేవలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇప్పటి వరకు మైనర్, మేజర్ పంచాయతీలు ఉండేవి. కొన్ని మైనర్ పంచాయతీలకు ఒక మేజర్ పంచాయతీని కలిపి క్లస్టర్ పంచాయతీగా చేశారు. ఈ విధానం 2010 నుంచి అమల్లోకి వచ్చింది. క్లస్టర్ పాలన తొలగించి.. గ్రేడింగ్ పాలనను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. మూడేళ్ల సరాసరి ఆదాయాన్ని ప్రాతిపదికగా గ్రేడ్‌లు కేటాయించింది. మూడేళ్లలో రూ.కోటి ఆదాయం దాటిన పంచాయతీని స్పెషల్ గ్రేడ్ కింద చేర్చారు. 4 వేల నుంచి 10 వేలలోపు జనాభా ఉండి రూ.50 లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉన్న పంచాయతీలను గ్రేడ్ -1 కిందకు తీసుకొచ్చారు. 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను ఆదాయంతో సంబంధం లేకుండా గ్రేడ్ -2, 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ -3 కింద ఎంపిక చేశారు. పంచాయతీల గ్రేడ్‌ల విధానానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. గ్రేడ్‌ల విధానం అమల్లోకి రావడంతో పంచాయతీల్లో సిబ్బంది పెరగడంతో పాటు పల్లె వాసులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

జిల్లా	స్పెషల్‌గ్రేడ్	గ్రేడ్ -1	గ్రేడ్ -2	గ్రేడ్ -3
పల్నాడు	13	169	111	236
బాపట్ల	16	126	102	217
గుంటూరు	13	80	56	108

మున్సిపాలిటీ తరహాలో.. పంచాయతీ విభాగాలు..

మునిసిపాలిటీల తరహాలో గ్రామ పంచాయతీల్లో పలు విభాగాలను ఏర్పాటు చేసి.. వాటి ద్వారా మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక, వీధి లైట్లు, ఇంజనీరింగ్ రెవెన్యూ (మిగతా 8వ పేజీలో)

పరిశుభ్రమైన జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నగరం మండలంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ కళాశాలలోని ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నగర ప్రధాన కూడలి నుంచి కళాశాల వరకు జరిగిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సీఎం నారా చంద్రబాబు ప్రారంభించారని తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం ఒక అంశాన్ని తీసుకుని.. ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతోందన్నారు. ఈ నెల వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే అంశంపై కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టే ముందుగానే.. మరు గుదొడ్డి కట్టుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణం జరగాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాలని కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, యుక్త వయస్సులో బాలికల్లో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారితో అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ సమస్యలను గోప్యంగా ఉంచుకోకుండా తల్లికి, స్నేహితులకు చెప్పుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం చేతులు శుభ్రత ఆరోగ్యానికి భద్రత ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గౌడపాలెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును లబ్ధిదారులతో ప్రారంభోత్సవం చేయించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, ఆర్డీవో రామలక్ష్మి, మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నేడు సూర్యలంక బీచ్‌కు గవర్నర్ రాక

బాపట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం బాపట్లలోని సూర్యలంక బీచ్ పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.శనివారం గవర్నర్ పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజ్‌భవన్ నుంచి ఉదయం 11.45 గంటలకు గవర్నర్ సూర్యలంక బీచ్ చేరుకుని గోల్డెన్ శాండ్‌లో విశ్రాంతి తీసుకుంటారని.. రాత్రి 7.55 గంటలకు తిరిగి వెళ్లిపోతారన్నారు. పర్యటన ఇన్‌చార్జిగా జేసీ భావన వశిష్ఠ ఉంటారన్నారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీపీఓ ప్రభాకరరావు, డీఎంఅండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

వేమవరం.. పారిశుధ్య శాపం

- సర్పంచ్ రాజీనామాతో నిలిచిన పనులు
- పారిశ్రామిక వాడలో పడకేసిన పారిశుధ్యం



కాలువలో వ్యర్థాలతో ముందుకు కదలని మురుగు నీరు

బల్లికురవ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశ్రామిక వాడగా ఉన్న వేమవరం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటసుబ్బయ్య చౌదరి రెండు మాసాల క్రితం వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేయడంతో.. గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. ఇన్‌చార్జి సర్పంచ్‌ను కూడా ఇంత వరకు అధికారులు నియమించలేదు. దీంతో పంచాయతీ ఖాతాలో నిధులు ఉన్నా.. అభివృద్ధి పనులు జరగడం లేదు. వేమవరం గ్రామ పరిధిలో సుమారు రెండు వందల గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. పారిశ్రామిక వాడగా నాలు గేళ్లల్లో పెద్దఎత్తున అభివృద్ధి చెందింది. ప్రభుత్వ పరంగా పెద్ద ఎత్తున నిధులు వస్తుంటాయి. గ్రామంలో చెత్త సేకరించే కార్మికుల జీతాల బిల్లులు నాలుగు నెలల నుంచి పెట్టలేదు. పగలు రేయి అన్న తేడా లేకుండా వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. పారిశుద్యం చేయించే పరిస్థితి కనిపించడం లేదు. రోడ్లపై మురుగు పారుతూ.. అంటు వ్యాధుల భయాన్ని ప్రజల్లో కలిగిస్తోంది. కనీసం గ్రామంలో మురుగు నిల్వల వద్ద బ్లీచింగ్ కూడా చల్లించిన దాఖలాలు ఏడాది నుంచి లేవని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామ సచివాలయానికి వెళితే.. సర్పంచ్ లేకపోవడంతో.. తాము ఏ పనులూ చేయించలేమని సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే కలుగజేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో కుసుమకుమారిని వివరణ కోరగా.. ఇన్‌చార్జి సర్పంచ్‌గా జిల్లా అధికారులు ఇంకా ఎవరిని నియమించ లేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా పారిశుద్ధ్య పనులు చేపడుతామని చెప్పారు.

పంచాయతీ ఖాతాలో.. కాసులు!



పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.70.04 కోట్లు పంచాయతీల వారీగా బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేయనుంది. నిధుల విడుదలతో పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలిగింది.

- ఆర్థిక సంఘం నిధులు జమ
- ఉత్తర్వులిచ్చిన పంచాయతీ రాజ్ శాఖ
- ఉమ్మడి జిల్లాలకు రూ.70 కోట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా 2025-26 సంవత్సరానికి మొదటి విడత నిధులను గత నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను పంచాయతీలకు జమ చేస్తున్నట్లు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాకు రూ.31 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ.16 కోట్లు నిధులు విడుదలయ్యాయి. 60 శాతం టైడ్, 40 శాతం అన్‌టైడ్ నిధులుగా విడుదలయ్యాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది.

నిధుల ఖర్చు ఇలా..

ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటు రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధుల్లో కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తోందన్నారు.

కలెక్టర్‌గారి అనుభవ పాఠాలు!

- యూపీఎస్సీ ఆశావహులకు ఉచిత శిక్షణ
- ప్రతి శనివారం ఒక గంట షెడ్యూల్ సర్దుబాటు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా పాలనలో క్షణం తీరిక లేకుండా గడిపే కలెక్టర్ అధ్యాపకుడిగా మారారు. తన విలువైన సమయంలో కొంత యువత భవిత కోసం కేటాయించారు. సివిల్ సర్వీసెస్‌లో తన అనుభవాన్నంత రంగరించి యూపీఎస్సీ ఆశావహులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ బృహత్ కార్యానికి శనివారం జూమ్ మీటింగ్ ద్వారా శ్రీకారం చుట్టారు. డిగ్రీ చదువుతూ యూపీఎస్సీ లక్ష్యం నిర్దేశించకున్న విద్యార్థులతో పాటు గ్రూప్-1కు సిద్ధమవుతున్న ఎంతో మంది ప్రాథమికంగా అవగాహన కల్పించాలని తనను కోరడంతో.. ప్రతి శనివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణకు కేటాయిస్తానని కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. తొలివారం 75 మంది విద్యార్థులు జూమ్ మీట్‌కు హాజరవ్వగా.. 70 మంది వరకు బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థులే ఉన్నారు.

ప్రతివారం ఒక అంశం..

ప్రతి శనివారం ఓ టాపిక్ తీసుకుని దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రణాళిక సిద్ధం చేశారు. మొదటి వారం డైలీ షెడ్యూల్‌ను ఎలా సర్దుబాటు చేసుకోవాలో విద్యార్థులకు వివరించారు. అయితే తానొక్కడినే కాకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చే సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను కూడా ఇందులో భాగస్వామ్యం చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. అవసరాన్ని బట్టి స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినందున వారికి గైడెన్స్ సహకారం అందించడం మరింత సులభమవుతుందని అభిప్రాయపడ్డారు.

పెట్టుబడులు పెట్టండి..

- భాగస్వామ్య సదస్సులో ఎంపీ తెన్నేటి


బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హాజరయ్యారు. సింగపూర్ దేశమంత్రి కె.షణ్ముగంను కలిసి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను సింగపూర్‌కు ఎగుమతి చేయడంపై చర్చించారు. ఏపీలో పండ్లు, కూరగాయలు వంటి నాణ్యమైన ఉత్పత్తులకు సింగపూర్ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను ఎంపీ వివరించారు. ఆ దేశ పారిశ్రామికవేత్త ఆనంద్‌తో భేటీ అయ్యారు. యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం చైర్మన్ జాన్ చాంబర్స్‌తో సమావేశం అయ్యి.. ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ఎంపీ తెన్నేటి పలువురు పారిశ్రామిక వేత్తలను కలిసినట్లు తెలిపారు.



సింగపూర్ దేశమంత్రి షణ్ముగంతో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

సమయపాలన, శ్రద్ధ విజయ సోపానాలు

- చెన్నై జీఎస్టీ జాయింట్ కమిషనర్ ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

బాపట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమయపాలన, శ్రద్ధ విద్యార్థుల విజయసోపానాలని బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి, చెన్నై జీఎస్టీ జాయింట్ కమిషనర్ పి.ఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో జరుగుతున్న దీక్షారంభ్ 6వ రోజు కార్యక్రమంలో ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సమయం ఎంతో విలువైనదని దానిని వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. సమయపాలన ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం నూతన విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి, డాక్టర్ లాల్ అహ్మద్ మొహ్మద్, డాక్టర్ సంధ్య బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ఆయువు తీస్తాయి

- ఆక్వా పరిసరాల్లో ప్రమాదభరితంగా విద్యుత్ సేవలు



రొయ్యల చెరువులు

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగుకు విద్యుత్ సౌకర్యమే ఆయువు. ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీతో చేపలు, రొయ్యల చెరువుల వద్ద ఏరియేటర్స్ వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో చెరువుల చుట్టూ విద్యుత్ అమరికలు ప్రమాదభరితంగా మారాయి. జిల్లాలో బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, చినగంజాం తదితర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇక్కడ వలస కూలీల కుటుంబాలు వందల్లో నివాసం ఉంటున్నాయి. చెరువుల చుట్టూ విద్యుత్ అధికారులు ఇబ్బడిముబ్బడిగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. చాలాచోట్ల ఇళ్ల వరండాల్లోనే వీటిని అమర్చారు. నివాసాల వద్ద నేలపైనే విద్యుత్ తీగలు జాయింట్లతో ఉన్నాయి. విద్యుదాఘాతంతో గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. ఒక వేళ కూలీలు.. కరెంట్ షాక్‌కు గురైతే.. వెంటనే హాస్పిటల్‌కు తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిస్థితిని అనుసరించి బాధితులకు సీపీఆర్ అందించాలని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల గుట్టు రట్టుకు కిట్

- డ్రగ్స్ డిటెక్షన్ కిట్ పరిశీలించిన ఎస్పీ



డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి, హెరాయిన్ ఇతర మాదకద్రవ్యాలను డ్రగ్స్ డిటెక్షన్ కిట్ ద్వారా సులభతరంగా గుర్తించ వచ్చని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను ఎస్పీ పరిశీలించారు. రాష్ట్ర ఈగల్ సెల్ జిల్లాకు దీనిని కేటాయించిందని తెలిపారు. కిట్ వినియోగ విధానాన్ని తెలుసుకుని.. క్లూస్‌టీం తగిన సూచనలు చేశారు. యువత ఉజ్వల భవిష్యత్తు అంధకారంగా మారుస్తున్న మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కార్యాచరణ రూపొందించామని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలను ద్రవ రూపంలో, చాక్లెట్‌లుగా తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. వాటిని డ్రగ్ డిటెక్షన్ కిట్ సాయంతో సులభంగా పరీక్షించి నిర్ధారించడానికి అవకాశం ఉంటుందన్నారు. క్లూస్ టీం నివేదిక ఆధారంగా మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తును వేగవంతం చేయొచ్చని చెప్పారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు, క్లూస్ టీఎం ఎస్సై కె.వెంకటేష్, ఈగల్‌సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులను చదివించడం అభినందనీయం

- మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో మంది పేద విద్యార్థులను చదివించడం అభినందనీయం అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని గరువు రోడ్‌లో మాగంటవారి తోటలో శనివారం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్మ కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘీయులు అంతా కలసి తోటి వారికి సహాయ పడాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సంఘీయులు పేద వారికి అండగా నిలిచి వారిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సాంబశివరావు, గుళ్ళపల్లి శ్రీనివాసరావు, తలశిల శ్రీనివాసరావు, స్వతంత్ర తేజ్‌కుమార్, రావి సాంబశివరావు, దండమూడి నాగమల్లేశ్వరరావు, గుమ్మడి శివ, కనగాల మధుసూదనరావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

బగళాముఖి ఆలయంలో నూతన పద్మపీఠం



రాగియంత్రాలు , స్టీల్‌నాణేలు పూజారులకు అందజేస్తున్న ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహమూర్తి, చైర్మన్ కలకోటచక్రధర్‌రెడ్డి

పిట్టలవానిపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చందోలులోని.. బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఉన్న పాత సిమెంట్ పీఠం, సింహాల విగ్రహాల స్థానంలో డోనార్ స్కీం ద్వారా నూతన రాతి పద్మ పీఠం, పంచలోహ సింహాలు ఏర్పాటు చేస్తున్నట్లు త్రిముఖ దేవాలయాల ఈఓ జి.నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తమ కుటుంబం నుంచి రూ.10లక్షల విరాళం ప్రకటించినట్లు వెల్లడించారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు.. బాపట్ల డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షణలో, ధర్మకర్తల మండలి, భక్తుల సమక్షంలోతొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో బయటపడిన పీఠం మధ్యలో 2001లో నిక్షిప్తం చేసిన మూడు రాగియంత్రాలు, 21 స్టీల్ నాణేలు, పాదరసం భద్రపరిచి అధికారుల సమక్షంలో ఆలయ పూజారులకు అందజేశామని వివరించారు.

అవీ..ఇవీ..

కార్యకర్తలే పార్టీకి అత్యంత బలం

● వారికి అండగా టీడీపీ అధిష్ఠానం: ఎమ్మెల్యే కొండయ్య

● కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అభివృద్ధికి కార్యకర్తలే బలమని, విపత్కర పరిస్థితులలో ఆయా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 17వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త లంకోతుల నరసింహారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ నేపథ్యంలో జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన కార్యకర్తల సంక్షేమ నిధి నుండి మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సాయం పత్రాలు శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అండగా ఉంటామని చెప్పారు. అలాగే చీరాల ఎంపీడీవో కార్యాలయంలో పీ4 కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో ప్రసన్న, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వనసమారాధన


చినఅంబడిపూడి శివాలయంలో పూజలలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా మండలంలోని చినఅంబడిపూడి శివాలయంలో శనివారం కార్తీకవన సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయ పూజారి పేటేటి లక్ష్మీవరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.. గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కార్తీక వన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గ్రామస్థులు సమష్టి కృషితో వనభోజన కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టడంతో పరిసర గ్రామాల భక్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలో బిర్సాముండా జయంతి

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పోరాట యోధుడు బిర్సాముండా 151వ జయంతిని శనివారం మండలంలోని జొన్నతాళి, ద్రోణాదుల గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బిర్సాముండా జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ సమన్వయకర్త వి.సత్యసాగర్ విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో సీఆర్పీ రమేష్, ప్రధానోపాధ్యాయులు శిరీష తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ అప్‌డేట్ కోసమే ఆధార్ క్యాంపులు

పంగులూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం మండలంలో ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఈనెల 17, 18 తేదీలలో రేణంగివరం, అలవలపాడు సచివాలయాలకు సంబంధించి రేణంగివరం సచివాలయంలో, కొండమంజులూరు, రామకూరు సచివాయాలకు సంబంధించి కొండమంజులూరు సచివాలయంలో ఆధార్‌కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 19, 20 తేదీలలో పంగులూరుకు సంబంధించి పంగులూరు -1 సచివాలయంలోనూ, కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాలకు సంబంధించి బూదవాడ సచివాలయంలో ఆధార్‌అప్‌డేషన్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బతుకుదెరువుకు వెళ్లి కానరాని లోకాలకు..

● హైదరాబాద్‌లో నూతలపాడు యువకుడు మృతి

● పనిప్రదేశంలో విద్యుదాఘాతంతో ఘటన


రత్నకుమార్ (ఫైల్)

నూతపాడు(పర్చూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువు కోసం పొట్టచేతపట్టుకొని కూలీ పనులకు హైదరాబాద్ వెళ్లిన యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నూతలపాడులో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన తమ్ములూరి రత్నకుమార్(26) కేబుల్ కంపెనీలో పనికోసం హైదరాబాద్ వెళ్లాడు. రోజూ మాదిరిగానే పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రత్నకుమార్‌కు మూడు ఏళ్ళ క్రితం తల్లిచనిపోయింది, తండ్రి గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. తండ్రి ఆరోగ్య ఖర్చులతోపాటు, కుటుంబ పోషణకోసం పొరుగు రాష్ట్రం వెళ్ళి ఇలా ప్రమాదానికి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుది.

అత్తపై అల్లుడి దాడి

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): అత్తపై అల్లుడి దాడి చేసిన ఘటనపై శనివారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సుబ్బరాజు కథనం మేరకు మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన నాగాంజలికి పర్చూరుకు చెందిన ప్రేమ్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. మూడురోజుల క్రితం భర్తతో గొడవ జరగడంతో నాగాంజలి పుట్టింటికి వచ్చింది. భర్త ప్రేమ్‌కుమార్ శుక్రవారం బొమ్మనంపాడు వచ్చి భార్య గురించి అత్త యరమోతు వెంకాయమ్మను అడిగాడు. అద్దంకి వెళ్లినట్లు చెప్పడంతో తన భార్యను కాపురానికి రాకుండా చెడగొడుతున్నావని ఆగ్రహంతో అత్తపై దాడి చేశాడు. గాయపడ్డ వెంకాయమ్మ అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వెంకాయమ్మ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

పశుపోషకులకు దాణా పంపిణీ

కారంచేడు(పర్చూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులో పశుపోషకులకు 50 శాతం రాయితీపై పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో దాణా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశుపోషకులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం రాయితీపై దాణాను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భాగ్యరాజ్, రైతులు పశుపోషకులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలన ప్రక్షాళన!

(5వ పేజీ తరువాయి)

విభాగాలుగా విభజించనున్నారు. వీటి ద్వారా సేవలందించేందుకు సిబ్బందిని నియమిస్తారు. ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో ప్లానింగ్ అసిస్టెంట్లుగా సేవలందించనున్నారు. గ్రామల్లో కూడా భవనాలు, లేఅవుట్ నిబంధనలు ఇక నుంచి అమలు చేయనున్నారు. స్పెషల్ గ్రేడ్ కల్పించిన పంచాయతీని రూర్బన్ పంచాయతీ అని పిలుస్తారు. వీటిలో గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించి ప్రత్యేక అధికారులుగా నియమిస్తారు. ఇక నుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా పిలుస్తారు. రూర్బన్ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో కేడర్ అధికారులను నియమిస్తారు. ప్రభుత్వం 6 గ్రేడ్‌లుగా ఉన్న గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీతో పాటు గ్రేడ్ -1, గ్రేడ్ -2, గ్రేడ్ -3 పంచాయతీలుగా విభజించింది. జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్లలో సీనియారిటీని బట్టి వారికి పదోన్నతులు కల్పించి రూర్బన్ పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్లుగా నియమించనున్నారు.

సహకరించండి.. ప్రజలకు సేవ చేద్దాం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎం.కొండయ్య

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అమరావతి రాజధానితో పాటు విశాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్విరామంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. దేశంలో అభివృద్ధికి చిరునామాగా విశాఖ మారిందన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులతో అభివృద్ధిలో వేగం పెరిగిందన్నారు. కూటమి అధికారంలో పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ కల్పనలకు చక్కని ప్రణాళిక నడుస్తోందన్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో ఇప్పటికే అభివృద్ధికి బాటలు వేశామన్నారు. చీరాల నేతన్న కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు సాధించినట్లు చెప్పారు. సుదీర్ఘ కాలంగా చేనేత హ్యాండ్‌లూమ్ పార్కుకు నోచుకోక తిప్పలు పడుతున్న క్రమంలో ఇటీవలే పార్కుకు భూమిపూజ చేసినట్లు వివరించారు. అలాగే స్థానిక నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు క్రిటికల్ కేర్ ఏర్పాట్లు చేసినట్లు మాట్లాడారు. ఆటో నగర్‌లో సమస్యలు పరిష్కరించి సుమారు 400 మందికి స్థలాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇక మిగిలింది కుందేరు ప్రక్షాళన, ఆర్‌వోబీ వంతెన ఏర్పాటు. ఈ విధంగా మునుపెన్నడూ చూడని అభివృద్ధిని అనతికాలంలో చేసి చూపినట్లు తెలిపారు. అయితే ప్రతిపక్షాలు సమస్యలు సృష్టించి బురద చల్లే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. తానెక్కడా కూడా అవినీతిలో జోక్యం చేసుకోవడం లేదని వివరించారు. పార్టీ శ్రేణులు, ఇతరులు ఎవ్వరైనా అధికారులను, లేదా ఇతర ప్రజలను ప్రలోభాలకు గురిచేసినా, వసూళ్లకు పాల్పడిన వెంటనే సమాచారం అందించే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరచి ఉంటుందన్నారు. అవినీతి అంశాల్లో పార్టీకు చెందిన వారున్నా చర్యలుంటాయని ప్రజలకు ధైర్యాన్ని నింపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, సీనియర్ నాయకులు డా.పొగడదండ రవికుమార్ ఉన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా వాసిరెడ్డి




చేవూరి వాసురెడ్డి, చల్లా కోటేశ్వరరావు, అనంతవరపు దేవదానం

సంతమాగులూరు నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంతమాగులూరు మండల నూతన కమిటీ ప్రకటించారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా సంతమాగులూరు గ్రామంలోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన చేవూరి వాసురెడ్డికి అవకాశం దక్కింది. ఉపాధ్యక్షులుగా పాత మాగులూరు గ్రామానికి చెందిన చల్లా కోటేశ్వరరావు వరుసగా రెండవసారి వరసగా ఎన్నికయ్యారు. సజ్జాపురం గ్రామానికి చెందిన అనంతరపు దేవదానం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈయన గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు.

సాధారణ కార్యకర్త స్థాయి నుంచి

సంతమాగులూరులో సాధారణ కార్యకర్త చేవూరి వాసురెడ్డి మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిగా వాసురెడ్డి సంతమాగులూరు గ్రామానికి అల్లుడుగా వచ్చారు. రమారమి రెండు దశాబ్దాలకు పైబడి గ్రామ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. మాజీ ఎంపీపీ అట్లా చిన్నవెంకటరెడ్డి, సంతమాగులూరు మాజీ సర్పంచ్ దివంగత గడ్డం వెంకటరెడ్డి, ఇటీవల సంతమాగులూరు గ్రామంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులలో దర్శి నియోజకవర్గ వైసీపీ మాజీ ఇన్‌చార్జ్ బాదం మాధవరెడ్డికి అన్ని విషయాల్లో కీలక వ్యక్తిగా చేవూరి వాసురెడ్డి వ్యవహరించారనడ సందేహం లేదు.

కష్టకాలంలో గొట్టిపాటి వెంటే..

ఫ్యాక్షనిజానికి పెట్టింది పేరైన సంతమాగులూరు గ్రామంలో చేవూరి వాసురెడ్డి గొట్టిపాటి రవికుమార్ వెంటనే నిలబడ్డారు. 2014- 19 మధ్య కాలంలో అత్యం త క్రియాశీలకంగా గొట్టిపాటి వెంట నిలిచారు. దీంతో ఆయన సేవలను గుర్తించి మంత్రి రవికుమార్‌సైతం వాసు రెడ్డికే పట్టం కట్టారు. కొందరిలో అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ మిగిలిన అన్ని సామాజిక వర్గాల వారు వాసురెడ్డికే మద్దతు తెలిపారు.

ఆర్‌టీసీలో సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు బాబురావు

అద్దంకిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలు తరువాత ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కోంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంతో బస్సులలో రద్దీ పెరిగి సిబ్బందిపై పనిభారం పెరిగిందన్నారు. ఈ కారణంగా విధులలో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యం ఆ సిబ్బందిని సస్పెండ్ చేస్తోందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పథకం సక్రమంగా అమలు జరగాలంటే యాజమాన్యం 3వేల బస్సులను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. ఆర్‌టీసీలో ఎక్కువ మంది రిటైరయ్యారని, వెంటనే 11 వేల మంది సిబ్బందిని నియమం చేయాలన్నారు. ఆర్‌టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడే ఆ వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి సిబ్బందికి రక్షణ కల్పించాలన్నారు. బస్సులలో ట్రిమ్‌లకు చార్జింగ్ సౌకర్యం కల్పించాల న్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, అనూష, కృష్ణారెడ్డి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 మంది మందుబాబులకు జరిమానా

మేదరమెట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసి అద్దంకి కోర్టులో హజరు పరచగా న్యాయాధికారి వారికి జరిమాన విధించినట్లు ఎస్ఐ తెలిపారు. దీనికి సంబంధించి మద్యం తాగి వాహనం నడుతున్న ఒకరికి రూ.5 వేలు, మరోకరికి 4 వేలు, ఆరుగురికి 3 వేలు చొప్పున, మరో ఆరుగురికి 2 వేలు, మరొకరికి వెయ్యి రూపాయలు చొప్పున మొత్తం 15 మందికి 40 వేలు చొప్పున న్యాయాధికారి జరిమానా విధించనట్లు ఎస్సై తెలిపారు.

సినీనటుడు కృష్ణకు ఘన నివాళి

● ముఖ్య అతిథిగా సీఐ సుబ్బారావు హాజరు

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సినీనటులు సూపర్‌స్టార్ కృష్ణపై అభిమానంతో భారీ అన్నదానం నిర్వహించడం అభినందనీయమని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు అన్నారు. శనివారం కృష్ణ వర్ధంతి సందర్భంగా అభిమాన సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో పట్టణంలో బీఆర్ అంబేద్కర్ భవనంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ అభిమానం ఏదైనా గానీ సేవల్లో ముందుండడం హర్షణీయమన్నారు. నటులు కృష్ణ వినూత్న శైలిలో సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఆ తరహాలోనే మహేష్‌బాబు సుమారు 1500 మంది చిన్నారులకు గుండె సంబంధిత చికిత్సలు అందించినట్లు వివరించారు. కృష్ణ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో అభిమానులు యోహాను, బషీర్, గౌస్, వెంకటేశ్వరరెడ్డి, జాన్, సయ్యద్‌బాబు, సూరి తదితరులు పాల్గొన్నారు.

సోదరుని కుమారుడి దాడి.. వృద్ధుడికి గాయాలు

అద్దంకి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిపై సోదరుడి కుమారుడు దాడి చేయడంతో గాయపడిన ఘటన మండలంలోని శంకవరప్పాడులో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు., మండలంలోని శంఖవరప్పాడుకు చెందిన కైపు శ్రీరాములురెడ్డి, సోదరుని కుమారుడు సుధాకరరెడ్డిల మధ్య పొలం గట్టు విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. శ్రీరాములురెడ్డిపై సుధాకరరెడ్డి దాడి చేయడంతో చెవికి గాయాలయ్యాయి. శ్రీరాములురెడ్డిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పంగులూరు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో నూతనంగా నిర్మితమైన సామాజిక భవనంతో పాటు సీసీరోడ్లు, దోబీఘాట్లను ప్రారంభించనున్నారు. అనంతరం 11 గంటలకు రామకూరు గ్రామంలో జరిగే పలు కార్యక్రమాలలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొంటారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర


అద్దంకిలో అధికారుల మానవహారం

అద్దంకి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశు భ్రత పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి పాత గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శింగరకొండ రోడ్డు లోని కాకానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : విద్యార్థులందరూ పరిశుభ్రతను పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి. బాలమ్మ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరూధిని, ఎంఈవో -2 కేవీ.శీనివాసరావు, హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు: సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించడంతో పాటు శుద్ధమైననీటిని వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి యం. అనంతరాజు అన్నారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.స్వరూపారాణి, తహసీల్దార్ పి.సింగారావు, డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, హెచ్.యం. ఐ.అనిత తదితరులు పాల్గొన్నారు. వీవోఏలకు ఎంపీడీవో స్వరూపరాణి శిక్షణ ఇచ్చారు.

బల్లికురవ : పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పేర్కోన్నారు. శనివారం బల్లికురవ మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర దివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ ఎంపీడీవో సుమతి, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం రాజారావు, సర్పంచ్ పందిరి అంజిబాబు, టీడీపీ నాయకులు గొట్టిపాటి కిషోర్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

చినగంజాం : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి రఘునందన్, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావులు అన్నారు. స్వరాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత కార్యక్రమంపై చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు ఆధ్వర్యంలో శనివారం అధికారులు ర్యాలీ నిర్వహించారు.

ఇంకొల్లు : గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కలిగించాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ సూచిం చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెలుగు సిబ్బంది వీవోలతో సమావేశం నిర్వహించారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

చినగంజాం, నవంబరు 15 బ(ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవడితే ఉజ్వల భవిత సాకారమవుతుందని రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్.ఎం ఆర్‌ఎస్‌వీ.పోతురాజు అన్నారు. శాఖా గ్రంథాలయం చినగంజాంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక పఠనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడుకు దూరంగా, సాంకేతికతకు దగ్గరగా మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మి నరసింహాచార్యులు, బీసీ సంక్షేమ వసతి గృహం విద్యార్థినులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో కల్వర్టు ప్రారంభం


కల్వర్టును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, నవంబరు 15,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఇస్లాంపేటలో రూ.4.20 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్వర్టును టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు శనివారం ప్రారంభించారు. పంచాయితీ నిధులతో ఈ కల్వర్టును నిర్మించగా ఇస్లాంపేట వాసులు అనందం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, స్థానిక టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు ,మాబాషా, వలేరు మార్క్,బోడావుల శివయ్య, జరుగుల శ్రీనివాసరావు, కందిమళ్ల వెంకటేశ్వర్లు, వడ్లమూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంతో తీరిన అవస్థలు

● హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

పోతినవారిపాలెం(పర్చూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని పోతినవారిపాలెం - స్వర్ణ రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు గుంతల కావడం, గులకరాళ్ల లేని ఉండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డు దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోవడంతో మోక్షం కల్గినట్లు అయ్యింది. యుద్ధప్రాతిపదికన రోడ్డును అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవడంతో గ్రామస్థులు ప్రజా కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుందేరు శుభ్రపడితేనే చీరాల అభివృద్ధి

● కుందేరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కుందేరు అభివృద్ధితోనే చీరాల ప్రాంత అభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ప్రజావేదిక వ్యవస్థాపకులు గుమ్మడి ఏసురత్నం ఆధ్వర్యంలో కుందేరు అభివృద్ధిపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణానికి పేరుకుపోయిన మురుగుతో కుందేరు కారణంగా భవిష్యత్తు తరాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాలువను పూడికలు తీసి ఆధునీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబురావు, ఏఐటీయూసీ నాయకులు శామ్యేల్, ప్రజాసంఘాల నాయకులు చుండూరు వాసు, చిరంజీవి, లింగంపల్లి జయరాజ్, దాసరి ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

చిన్నారుల వసతులపై జాగ్రత్తలు పాటించండి

● గిరిజన బాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● వేటపాలెంలో జాన్ జాతీయ గౌరవ దివాస్ వేడుకల్లో జేసీ


చిన్నారికి కేక్ తినిపిస్తున్న జేసీ భావన

వేటపాలెం(చీరాల), నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : గిరిజన పాఠశాలల్లో చిన్నారుల వసతులపై నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని జేసీ భావన పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండలం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా 150వ జయంతి(జాన్ జాతీయ గౌరవ దివాస్) వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సమస్యలపై ఆంగ్లేయులతో పోరాడిన ముండాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉత్తమంగా రాణించాలన్నారు. గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గిరిజన ప్రాంతాల్లో తాను పనిచేసి వారి అభ్యున్నతికి కృషి చేసినట్లు జేసీ చెప్పారు. కేక్‌కటింగ్ నిర్వహించి స్వయంగా చిన్నారులకు తినిపించారు. అంతకుముందు బిర్సాముండా చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి ప్రకాష్‌రావు తహసీల్దార్ గీతారాణి, ఎంపీడీవో రాజేష్‌బాబు, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వీరయ్య పాల్గొన్నారు.

వేటపాలెంలో గంజాయి స్వాధీనం

● నలుగురు నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శేషగిరిరావు, పక్కన ఎస్సై జనార్దన్

వేటపాలెం(చీరాల), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఒడిశా వాసితో పాటు మరో ఇద్దరిని వేటపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ శేషగిరిరావు శనివారం వేటపాలెం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన ప్రభాకర్ జెన మండల పరిధిలోని జబ్బార్ కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలోనే ఆయన తరచూ ఒడిశాకు వెళ్లి అతని మిత్రుడు అనీల్ గైడ వద్ద తరచూ గంజాయి కొనుగోలు చేసి వేటపాలేనికి తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో విషయాన్ని గ్రహించి డీఎస్పీ ఎండీ మొయిన్ ఆదేశాల మేరకు సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్ధన్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈనేపథ్యంలోనే గంజాయి విక్రయిస్తున్న ప్రభాకర్ జెనను, కొనుగోలు చేస్తున్న షేక్ ఇమ్రాన్ బాషా, కఠారి వెంకటేశ్వర్లు, నారాయణ సాహూ అనువారిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకుని 1250 గ్రాములు గంజాయి, రూ. వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా


రహదారిపై తిరగబడ్డ ఆటో

మేదరమెట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మొక్కలతో వెళుతన్న ఫోర్‌వీల్ ఆటో డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. శనివారం భద్రచలం ఉండి ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు జామాయిల్ మొక్కలతో వెళుతున్న ఆటో మేదరమెట్ల బైపాస్‌లో డివైడర్‌ను ఢీకొని బో ల్తా పడింది. డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆటోలోని మొక్కలు రోడ్డుపై చల్లా చెదురుగా పడిపోయాయి. మేదరమెట్ల పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు.



నియమాల ధారణం

- నేటి నుంచి అయ్యప్ప మండల దీక్ష
- క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పే 'మాల'
- ఏటా జిల్లా నుంచి శబరిమలకు 25వేల మంది భక్తులు
- పంబా తీరానికి ఆర్టీసీ బస్సులు
- యాత్రికుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు
- రేపటి నుంచి సర్వీసుల ప్రారంభం



నల్లని దుస్తులు... నుదుటన విభూది పట్టీలు, గంధం కుంకుమ బొట్లు... మెడలో మాలలు... చెప్పుల్లేకుండా నడక... అయ్యప్ప దీక్షలో ఉండటం అంటే చాలా మందికి ఇంతవరకే తెలుసు. కానీ అయ్యప్ప దీక్ష కేవలం భక్తికే కాదు, ఆధ్యాత్మిక శక్తి... అంతకుమించి క్రమశిక్షణ, సత్ప్రవర్తన, అహంకారాన్ని వీడటం వంటి ఎన్నో సద్గుణాలను నేర్పుతుంది. ఏటా జిల్లాలో వేల మంది అయ్యప్ప దీక్ష ధరించి శబరిమల యాత్రకు వెళుతున్నారు. అలాంటి వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు, ఆఫర్లు ప్రకటించింది. నెల్లూరులో ప్రసిద్ధిగాంచిన అయ్యప్ప గుడిలో ఆదివారం నుంచి మండల దీక్ష ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం 8వపేజీలో...

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షల ఫీజుల చెల్లింపు గడువును పొడి గించినట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2026, మార్చిలో జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు, జనర ల్, ఒకేషనల్ విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు రూ.2వేల అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



నృసింహస్వామి దర్శనానికి వెళ్తున్న హైకోర్టు జడ్జి సుజాత

పుణ్యక్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి

వలేటివారిపాలెం/సీతారామపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం హైకోర్టు జడ్జి సుజాత దర్శించుకున్నారు. తొలుతు ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సుజాతను పూలమాల, శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేవారు. ఆమె వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, కందుకూరు సివిల్ జడ్జి సునీల్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనృసింహం తదితరులు పాల్గొన్నారు. సీతారామపురం మండలంలోని సిద్దేశ్వరం, భైరవకోన శైవక్షేత్రాలను కూడా హైకోర్టు జడ్జి సుజాత సందర్శించి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఉదయగిరి జడ్జి జే.అంజయ్య, కోర్టు, పోలీసు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

- లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.14,39,921 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా అన్నదానం ద్వారా రూ. 7,13,465, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,12,695, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,97,400 లభించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో పదోన్నతులు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రూరల్ ఈఈ సోమశేఖర్‌రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను ఎంఆర్‌టీ ఈఈ లక్ష్మీనారాయణకు అప్పగించారు. నెల్లూరు డివిజన్ విజిలెన్సు అసిస్టెంట్ ఇంజనీర్ సుధీర్‌ను డీఈగా పదోన్నతి కల్పిస్తూ ఉదయగిరికి బదిలీ చేశారు. బుజబుజ నెల్లూరు ఏఈ రాజాబాబును డీఈఈగా పదోన్నతి కల్పించి ట్రాన్స్‌ఫార్మర్ల సెక్షన్‌కు బదిలీ చేశారు. నెల్లూరు హెచ్‌డీ మీటర్స్ ఏఈ గోపిని డీఈఈగా పదోన్నతి కల్పించి గూడూరు స్టోర్స్‌కు బదిలీ చేశారు. కోవూరు ఏఈ తేజాశ్రుతికి డిఈఈగా పదోన్నతి కల్పించి తిరుపతి కార్పొరేషన్ కార్యాలయానికి బదిలీ చేశారు.

వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ అలీ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్.మహమ్మద్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముతవల్లిలు, ఇమామ్‌లు, ముస్లిం కమిటీ సభ్యులు, మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదులు, దర్గాలు, శ్మశానవాటికలు మొదలైన ముస్లింలకు సంబంధించిన సంస్థల పరిధిలో ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను, భూములను, స్థలాలను కేంద్ర ప్రభుత్వ ఉమ్మీద్ పోర్టల్‌లో సరైన పత్రాలతో అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు ఉన్నట్లు చెప్పారు. పోటీ పరీక్షల కోసం త్వరలోనే మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని, ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, తదితర మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కుదావన్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గరళ కంఠులం!

- మనం పీల్చుతున్నది గాలా.. గరళమా!?
- జిల్లాలో పెరుగుతున్న వాయు కాలుష్యం
- నెల్లూరు నగరంలో మరింత ఎక్కువగా..
- వాహనాల వినియోగం ఎక్కువవడమే కారణం
- రోజుకు 100 టన్నులకుపైగా కార్బన్ డయాక్సైడ్ విడుదల
- తద్వారా క్వింటాళ్ల కొద్ది విషవాయువులు
- మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ప్రత్యామ్నాయం చూడకుంటే భవిష్యత్తు ప్రమాదకరం
- 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం

నెల్లూరులోని ఆరేళ్ల చందుకు ప్రతిరోజు సాయంత్రం తాతయ్యతో కలిసి ఓ చెట్టుకింద కూర్చోవడం అలవాటు. రోజులాగే వారు అక్కడకు వెళ్లారు. కానీ ఎందుకో చెట్టు మునుపటిలా అందంగా కనిపించలేదు చందుకు. వెంటనే పక్కనే ఉన్న తాతయ్యను అడిగాడు. చెట్టును కమ్మేసిన నల్లటి పొగను చూపించి దాని వల్లే చెట్టు బాధపడుతోంది నాయనా అని చెప్పాడు. కొంతసేపటి చెట్టు ఆకుల అంచు నుంచి చుక్కలు, చుక్కలుగా నీరు కారడం చందు చూశాడు. కారణమేమిటని తాతయ్యను అడిగాడు. వాహనాలు విడుదల చేసే పొగను పీల్చుకోలేక చెట్టు ఏడుస్తోంది నాయనా అని తాత సమాధానం ఇచ్చాడు. పొగ మనల్ని ఏమి చేయలేదు కదా తాతయ్య, చెట్టును మాత్రం ఎందుకు ఏడిపిస్తోందని అడిగాడు చందు అమాయకంగా. పొగ నుంచి వచ్చే విషవాయువులను తనలో జీర్ణం చేసుకోలేక చెట్టు ఏడుస్తోంది చందూ. మనకు తెలియడం లేదు కానీ ఈ గాలి పీల్చడం ద్వారా మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలు ఏడుస్తున్నాయి సమాధానం చెప్పాడు తాత. మరి ఈ పొగను పోగొట్టాలంటే ఏం చేయాలి తాతయ్యా అడిగాడు చందు. ఇలాంటి చెట్లు ఇంకా చాలా నాటాలి నాయనా అన్నాడు తాతా. చాలా అంటే ఎన్ని తాతయ్యా...! మళ్లీ అడిగాడు చందు. ఏమి చేయాలో తెలియకున్నా ఏదో చేయాలనే ఆ మనువడి తపన చూసి 19.71 లక్షల చెట్లు నాయనా.. అని లెక్కగట్టి చెప్పాడు తాత. అంతకన్నా లోతుగా చెప్పినా ఆ పిల్లాడికి అర్థం కాదన్న ఉద్దేశంతో క్లుప్తంగా ముగించాడు.

నెల్లూరులో కాలుష్య ప్రభావం గురించి ఒక కథ చెప్పమని అడిగితే.. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చెప్పిన కథ ఇది. మనిషి సృష్టించిన కృత్రిమ మేథా ఇంత లోతుగా ఆలోచిస్తోంది కదా. అందునా జిల్లా ప్రజలు విద్యావంతులు. బాధ్యతనెరిగిన పౌరులు. జిల్లాను కబళిస్తున్న కాలుష్యం గురించి లెక్కలు చెబితే దీనికి పరిష్కారం ఆలోచిస్తారని, తమ వంతుగా వాతావరణ సమతుల్యతకు నడుం బిగిస్తారనే ఉద్దేశం తో ఆంధ్రజ్యోతి ఈ కథనం అందిస్తోంది. ఇది కథ కాదు. వాహన వినియోగం రూపంలో వెదజల్లుతున్న కాలుష్యానికి సంబంధించిన లెక్కల సారాంశం.

నిద్ర లేచామా.. బండెక్కామా! వీధిలోకి అడుగుపెట్టామా.. ఆటో ఎక్కామా.. కోరుకున్న చోటుకు చేరుకున్నామా! అంత వరకే ఆలోచిస్తున్న మనం ఒకసారి మన వాహనాలు విడుదల చేసే పొగ ద్వారా గాలి ఎంత కాలుష్యం అవుతుందో లెక్కలు తెలుసుకుంటే హడలిపోతాం. వాయు కాలుష్యానికి ప్రధాన కారణం వాహనాలకు వినియోగించే పెట్రోలు, డీజిల్. ఇంటికో వాహనం కనీస అవసరంగా మారిన ఈ తరుణంలో వాటి వినియోగం ద్వారా విడుదలయ్యే ప్రమాదకర కారకాల గురించి కూడా తప్పక తెలుసుకొని తీరాల్సిందే.

> కంఠంలో విషం నింపుకున్నాడు కాబట్టి శివుడ్ని గరళ కంఠుడు అంటారు. కానీ ఇప్పుడు మనలో ప్రతి ఒక్కరూ గరళ కంఠులే. శివుడికి, మనకు తేడా ఏమంటే ఆయన విషాన్ని గొంతులో దాచుకున్నాడు.. మనం ఊపిరి తిత్తుల్లో నింపుకొంటున్నాం అంతే.

ఉదాహరణకు నెల్లూరు నగరాన్ని తీసుకుందాం. కార్పొరేషన్ అధికారుల లెక్కల ప్రకారం నగర వైశాల్యం 149 చదరపు కిలోమీటర్లు. ఈ విస్తీర్ణంలో ప్రతిరోజు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో లెక్కిద్దాం. జిల్లావ్యాప్తంగా 3.9 లక్షల మోటారు సైకిళ్లు ఉన్నట్లు ఆర్టీయే శాఖ లెక్కలు చెబుతోంది. ఇందులో 60 శాతం మోటారు సైకిళ్లు నగర పరిధిలోనే ఉంటాయనేది ఆ శాఖ అధికారుల అంచనా. అంత ఎక్కువ వద్దులే. కనీసంగా 50వేల మోటారు సైకిళ్లు నగరంలో ఉన్నాయని అనుకుందాం. సగటున ఒక్కో మోటారు సైకిల్ రోజుకు అర లీటరు పెట్రోల్ కాల్చినా 25వేల లీటర్ల పెట్రోల్ వినియోగం అవుతోంది. ఇక ఆటోల విషయానికి వస్తే నగర పరిధిలో 13వేల ఆటోల వరకు తిరుగుతున్నట్లు అధికారుల అంచనా. అందులో కనీసం 7వేల ఆటోలు తిరుగుతున్నట్లు అనుకుందాం. ఒక ఆటో రోజుకు నగర పరిధిలో 100 నుంచి 120 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అందుకోసం 3 లీటర్ల డీజిల్ ఖర్చు చేస్తుంది. అంటే రోజుకు 21వేల లీటర్ల డీజిల్ కాల్చుతున్నారు అన్నమాట.

● 108 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల

ఒక లీటరు డీజిల్ దహనం వల్ల 2.68 కిలోల కార్బన్‌డయాక్సైడ్ విడుదల అవుతుంది. రోజుకు 21వేల లీటర్ల డీజిల్ కాల్చడం ద్వారా 59 మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదల అవుతుంది. పెట్రోల్ దహనం వల్ల కూడా దాదాపుగా ఇంతే కార్బన్ డయాక్సైడ్ (లీటరుకు 2.3కిలో గ్రాములు) విడుదల అవుతుంది. ద్విక్రవాహనాల వినియోగం ద్వారా రోజుకు 25వేల లీటర్లు కాల్చుతున్నారు. ఈ లెక్కన సుమారుగా మరో 59 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతుంది. త్రిచక్ర, ద్విచక్ర వాహనాలు ఒక రోజులో చేసే పెట్రోల్, డీజిల్ దహనం కారణంగా 118 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదలవుతోంది. ఇక కార్లు, బస్సుల వల్ల విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్‌ను లెక్కిస్తే మరింత పెరుగుతుంది.

● క్వింటాళ్ల కొద్దీ విషకారకాలు

వాహనాల ద్వారా విడుదలయ్యే కార్బన్‌డైయాక్సైడ్‌లో ఉన్న విషకారకాలు మరింత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. 147 కిలోమీటర్ల వైశాల్యం కలిగిన ఒక నగరంలో రోజుకు 50వేల లీటర్ల ఇంధనం కాల్చడం ద్వారా విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్, అందులోని విషకారకాలు మానవ జీవనంపై పెను ప్రభావం చూపుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఒక లీటరు ఇంధనం కాల్చడం ద్వారా 5నుంచి 15 గ్రాముల వరకు నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్) విడుదలవుతాయని అంచనా. నెల్లూరులో రోజు వారి కాల్చే 50వేల లీటర్ల ద్వారా 220 నుంచి 660 కిలోల నైట్రోజన్ ఆక్సైడ్లు విడుదల అవుతాయి. మానవ శ్వాసకోస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మానవ ఆరోగ్యంపై తక్షణ ప్రభావం చూపే విషపూరిత కారకంగా సైన్స్ ఎన్ఓఎక్స్‌ను అభివర్ణిస్తుంది.

ఇంధనం కాల్చడం ద్వారా గాలిలో కలిసే మరో ప్రమాదకారకం పార్టిక్యులేట్ మేటర్స్ (పీఎం). ఇది ఇంధనం పూర్తిగా మండకపోవడం వల్ల దట్టమైన పొగగా వ్యాపిస్తుంది. ఈ కారకాలు చాలా చిన్నవిగా ఉండటం వలన సులభంగా ఊపిరితిత్తుల్లో, రక్తంలో కలిసిపోతాయి. దీనివల్ల ఆస్తమా, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఒక లీటరు ఇంధనం కాల్చడం ద్వారా పాత ఇంజను అయితే 11 కిలోగ్రాములు, ఇలాంటి పీఎం రోజు వారి నెల్లూరు నగరంలో కాల్చే 50వేల లీటర్ల ఇంధనం ద్వారా సుమారుగా 100 కిలోగ్రాముల పీఎం విడుదల అవుతుంది. ఇవికాక ఇంధనం కాల్చడం ద్వారా విడుదలయ్యే కార్బన్‌మోనాక్సైడ్లు మానవులకు అత్యంత విషపూరితమైనవిగా సైన్స్ చెబుతోంది. ఇది రక్తంలోని ఆక్సిజన్ సరఫరాను అడ్డుకుంటుంది. నగరంలో రోజు వారి 50వేల లీటర్ల ఇంధనం కాల్చుతున్నారంటే దాని ద్వారా సుమారుగా 880 కిలోగ్రాముల సల్ఫర్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. ఇది కూడా మానవ ఆరోగ్యానికి హానికారకమే.

● ఒక చిన్న లెక్క

గాలి నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను వేరు చేయడానికి ఉన్న ఒకే ఒక మార్గం చెట్లు. ఒక మోస్తారుగా ఉన్న పెద్ద వృక్షం ఏడాదికి 21.77 కిలో గ్రాముల కార్బన్‌డయాక్సైడ్ (సీఓ2)ను గ్రహిస్తుంది. ఈ లెక్కన నెల్లూరులోని వాహనాలు రోజుకు 50వేల లీటర్ల ఇంధనాన్ని కాల్చుతున్నాయి అనుకుంటే తద్వారా విడుదల చేసే 118 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోవడానికి సుమారుగా 5400 వృక్షాలు ఏడాది కాలం పని చేయాల్సి వస్తుంది. అలా కాకుండా ఏ రోజుకారోజు విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించాలంటే నగరంలో 19లక్షల71వేల వృక్షాలు కావలి. జిల్లాలోని ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి. పట్టణ స్థాయికి తగిన విధంగా కాలుష్యమూ నెలకొని ఉంది.

● కాలుష్యాన్ని తగ్గించుకోవాలంటే!


వాహనాలు లేకుండా బతకాలేం. అలాగని ఇష్టారీతిగా ఇదే తరహాలో విచక్షణ రహితంగా బారెడు దూరానికి కూడా వాహనాన్ని వినియోగిస్తే భవిష్యత్తు ప్రమాదకరంగా మారడం తథ్యం. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవాలంటే అవకాశం ఉన్నంత వరకు వాహన వినియోగం తగ్గించాలి. కాలినడకను అలవాటు చేసుకోవాలి. నగరంలో నడవటానికి వీలుగా అధికార యంత్రాంగం ప్లాట్‌ఫారాలు నిర్మించాలి. విద్యుత్ వాహనాల సంఖ్య పెంచుకోవాలి. మొత్తంపై ఇంధన వినియోగం తగ్గించ డానికి ఏ చర్యలు తీసుకోవాలో అధికార యంత్రాంగం ఆలోచించాలి. ఆచరణలో పెట్టాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

50 వేల లీటర్ల ఇంధనం దహనం అయినప్పుడు విడుదలయ్యే కాలుష్య కారకాలు (సుమారుగా)

- కార్బన్‌డయాక్సైడ్ (సిఓ2): 131.5 మెట్రిక్ టన్నులు
- నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్): 275- 550 కిలోగ్రాములు
- సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్ఓ2): 5- 50 కిలోగ్రాములు
- పార్టిక్యులేట్ మేటర్స్ (పి.ఎం): 5 -150 కిలోగ్రాములు

నోట్: పై విలువలు కేవలం అంచనాలు మాత్రమే. ఇంధనం నాణ్యత, వాహన ఇంజన్ రకం, దహన సామర్థ్యం, పర్యావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.



గంగమ్మ పారంగా..

పుడమితల్లి పులకించగా!

- కాలువలకు నీటి విడుదల ప్రారంభం
- ముమ్మరంగా రబీ వ్యవసాయ పనులు
- 7.3 లక్షల ఎకరాల్లో పంటల సాగు

రబీ మొదలైంది. సీజన్ ఆరంభానికి ముందే వరుణుడు కటాక్షించడంతో విస్తారంగా వానలు కురిశాయి. దీంతో సోమశిల, కండలేరు వంటి ప్రధాన జలాశయాలతోపాటు చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మరోవైపు ఇటీవల జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో (ఐఏబీ) జిల్లా వ్యాప్తంగా దాదాపు 7.3 లక్షల ఎకరాలకు 73 టీఎంసీల సాగునీటిని కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఆ మేరకు శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేశారు. ఇలా అన్నీ సానుకూల పవనాలు అనుకూలించడంతో అన్నదాత వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. పొలం దుక్కి దున్నుకోవడం, నార్లు పోసుకోవడం వంటి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.



నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రబీ ఆరంభం కావడంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏ సీజన్‌లో అయినా రైతులు ఎక్కువగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ఓ వైపు ప్రత్యామ్నాయ పంటలవైపు అన్నదాతలు దృష్టిపెట్టాలని ప్రభుత్వంతోపాటు జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నా వరికే అధికశాతం మంది అడుగులు వేస్తున్నారు. నీరు అందుబాటులో ఉండడంతో దాదాపుగా 4.8లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగే అవకాశం ఉంది. గత రబీలో 3,57,562 ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. ఈలెక్కన 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగు పెరిగే అవకాశం ఉంది.

● ఈ రకాలవైపే మొగ్గు

అధికశాతం మంది రైతులు కేఎన్ఎం రకం వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆ తరువాత ఆర్ఎన్ఆర్, బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలున్నాయి. ఇందుకు తగ్గట్టుగానే వ్యవసాయశాఖ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచింది. కేఎన్ఎం733, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 16048, ఎన్ఎల్ఆర్ 34449 రకాలతోపాటు ఎంటీయూ 1010 రకం విత్తనాలు కూడా అందుబాటులో ఉంచారు. దాదాపుగా అన్ని రకాల విత్తనాలను కలిపి 70వేల క్వింటాళ్ల వరకు డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే జిల్లాలో దాదాపుగా 4వేల ఎకరాల్లో ఇప్పటికే వరితోపాటు శనగ, మినుము పంటలు సాగు ప్రారంభమైంది. 330 హెక్టార్లలో వరి, 992 హెక్టార్లలో మినుము, 222 ఎకరాల్లో శనగతోపాటు ఇతర పంటలను రైతులు సాగులోకి తీసుకొచ్చేశారు.

● కావలి సబ్‌డివిజన్‌లో అధికం

సాగునీటి విడుదల నేపథ్యంలో అత్యధికంగా కావలి సబ్ డివిజన్ పరిధిలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో సాధారణంగా 31వేల హెక్టార్ల వరకు వరితోపాటు వేరుశనగ, పత్తి, నువ్వులు తదితర పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఆ తరువాత కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి, సంగం మండలాల్లో 28,934 హెక్టార్లలో పంటలు సాగవుతాయి. ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో 12వేల హెక్టార్లు, నెల్లూరు, వెంకటాచలం, సైదాపురం మండలాల పరిధిలో 18400 హెక్టార్లు, ఇందుకూరుపేట, టి.పి.గూడూరు, ముత్తుకూరు మండలాల పరిధిలో 13800 హెక్టార్లు. పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, మనుబోలు మండలాల పరిధిలో 19810 హెక్టార్లు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల పరిధిలో 11750 హెక్టార్లు, ఇంకా ఉదయగిరి, కందుకూరు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తంగా 4లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందే అవకాశం ఉంది.

సాగునీటి కేటాయింపుల వివరాలు

ప్రాంతం పేరు	ఎకరాలు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2,15,552	21.55
కనుపూరు కాలువ	66,000	6.60.
కావలి కాలువ	1,00,000	10
ఉత్తర కాలువ	75,000	7.50
దక్షిణ కాలువ	48,000	4.80
కండలేరు లెఫ్ట్ కెనాల్	17,475	1.74
ఎస్ఎస్‌జీ (నెల్లూరు జిల్లా)	30,209	3.02
ఎస్ఎస్‌జీ (తిరుపతి జిల్లా)	1,75,649	17.56
మొత్తం	7,27,885	72.78

సోమశిల నుంచి నీరు విడుదల

అనంతసాగరం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మొదటి పంట (రబీ) సాగు కోసం సోమశిల జలాశయం నుంచి శనివారం అధికారులు నీరు విడుదల చేశారు. తొలుత గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి కొత్త పవర్ ప్లాంట్ నుంచి ఉత్తర కాలువకు సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి బటన్ నొక్కి 100 క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏబీలో తీసుకొన్న నిర్ణయం ప్రకారం 4.65 లక్షల ఎకరాలు డెల్టా, నాన్‌డెల్టాకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, వృథాకు తావు ఇవ్వద్దని రైతులకు సూచించారు. చివరి ఆయకట్టు వరకు నీరు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసకుమార్, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

- సోమశిలకు శనివారం 6,748 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 100, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 73.069 టీఎంసీలు నిల్వ ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 625

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,809
వెండి కిలో ధర రూ. 1,64,500
వెండి ఒక గ్రాము రూ.164.70

బీజేపీ మండల అధ్యక్షుడిగా వీరసుధాకర్



వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండల బీజేపీ అధ్యక్షుడిగా చుండి గ్రామానికి చెందిన ముతకని వీరసుధాకర్‌ను నియమించారు. ఈమేరకు ఆయన జిల్లా అధ్యక్షుడు వంశీంద్రరెడ్డికి, కందుకూరు బీజేపీ అధ్యక్షుడు ఘట్టమనేని హరిబాబుకు, పట్టణ అధ్యక్షుడు మన్నె వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూస్ బాక్స్

నేడు జూడో సెలక్షన్లు

ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 15 ఏళ్లు దాటిన బాల బాలికలకు జూడో సెలక్షన్లు జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి జీ మురళి ఒక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరేడులోని హైస్కూల్ దగ్గర జీఎం అకాడమిలో మధ్యాహ్నం 3గంటలకు జూడో సెలక్షన్లు జరుగుతాయని, గెలుపొందిన వారు కాకినాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు 8919036160 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డయాబెటిక్ రెటినోపతి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ జీ విష్ణుతేజ, పీ చిన్మయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. అల్లూరు పట్టణ పరిధిలోని రాజా రామిరెడ్డి గిరిజన కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన గిరిజన కుటుంబాలకు సరుకులతోపాటు దుప్పట్లు, టార్పాలిన్ పట్టలు, టార్చిలైట్లను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండూరు గోవిందయ్య, సుబ్రహ్మణ్యం, గిరిజన సంఘం నాయకురాలు బాపట్ల సత్యవతమ్మ, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

లింగసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి ఈ నెల 26 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని ముత్యాలపాడు, చినపవని, వీఆర్‌కోట ఆధార్ కేంద్రాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఆధార్‌లేని పిల్లలకు ఆధార్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చాటింపు వేయించాలని సూచించారు.

వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయం నుండి ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సహజంగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధులే ఎక్కువని, అందుకే ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. బహిరంగ మలవిసర్జన చేయరాదని, చెత్తను రోడ్లపై వేయవద్దని ప్రజలకు సూచించారు. తడి, పొడి చెత్తగా వేరుచేసి సిబ్బందికి అందజేయాలని సూచించారు. చేతులు శుభ్రపరుచుకునే విధానాన్ని చూపించి, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పురపాలక, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

పారిశుధ్యంపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీవో మాధవీలత తల్లులు, పిల్లలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహారం తీసుకొనే ముందు పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

బిట్రగుంట / ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం బిట్రగుంట ప్రాథమిక పాఠశాలలో, ఉలవపాడు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొని పుస్తకాలను వీక్షించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు, బీ శశి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, హెచ్ఎం ఎస్ హెప్సిబాం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటును పెంపొందించాలని వారు తల్లిదండ్రులకు సూచించారు.



రూ. 1లక్ష విరాళంగా అందజేస్తున్న సత్యనారాయణ

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పట్టణం లోని పామూరు రోడ్డుకు చెందిన జొన్నలగడ్డ సత్యనారాయణ, కోటేశ్వరమ్మ దంపతులు, వారి కుమారుడు మురళీకృష్ణ, సౌజన్య దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే పెద్దబజారుకు చెందిన మురారిశెట్టి బదరీనాథ్, సాయిసుధీర దంపతులు వారి కుమారులు వెంకటరాజేష్, వెంకటరాహుల్‌లు రూ. 25116 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లుకు ఈ మొత్తాలను అందజేశారు. కార్యక్రమంలో మంగపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కావలి ఎమ్మెల్యే దగుమాటి జన్మదిన వేడుకలు

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్టారెడ్డి 57వ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు బుర్రా శ్రీధర్ రెడ్డి 57 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే చేత కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 40 వార్డులలో పలు సేవ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఓ మండపంలో కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలి పారు. టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్‌కు మార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, కండ్లగుంట మధుబాబునాయుడు, బీజేపీ నాయకులు గుండ్లపల్లి భరత్, కుట్టుబోయిన బ్రహ్మానందం, జనసేన నాయకుడు సిద్దు పాల్గొన్నారు.

● టీడీపీ నాయకుడు సన్నిబోయిన కమల్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి స్వాములకు వడ్డించారు. జనసేన నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 19వ వార్డు అధ్యక్షుడు యోగూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదానం చేసిన అభిమానులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. టీవీ, నిత్యావసర సరుకుల వితరణ

● టీడీపీ నాయకుడు జనిగర్ల మహేంద్ర, బుర్లా శ్రీధర్ రెడ్డి సహకారంతో విద్యార్థుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు షాజీర్, జానీ, టీడీపీ నాయకుడు విష్ణుతేజ రెడ్డి మండలంలోని తాళ్లపాలెం ఆశానికేతన్ లో పేద విద్యార్థులకు నిత్యావసర సరుకులతో పాటు ఎల్ఈడీ టీవీని ఆశానికేతన్ నిర్వాహకులకు అందజేశారు.

అల్లూరులో..

అల్లూరు (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్య క్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంత రం పాతబస్టాండు కూడలిలో భారీ కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్ రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, బండి అమర్ రెడ్డి జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి

బిట్రగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేసేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని జిల్లా సీఐటీయు మహిళా నేత రీహనా బేగం డిమాండ్ చేశారు. బోగోలు మండలంలోని పలు అంగన్వాడీ సెంటర్లను సందర్శించి ఆమె బోగోలు అరుంధతివాడలోని సచివాలయం అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పెంచలమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

● బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని కంపచెట్లను టీడీపీ నేత ఇందుపూరు రామోహన్‌రెడ్డి సహకారంతో శనివారం తొలగించారు.

బోగోలులో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

బిట్రగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు పంచాయతీల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అన్న, వస్త్ర దానాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ ఉపాధ్యక్షులు కుంచాల తిరుమలేష్, లేల్లపల్లి సుధీర్‌బాబు, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాస యాదవ్, టీ వెంకటేష్, టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వరరెడ్డి, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, ఇందుపూరు రామోహన్‌రెడ్డి, బోగిరిప్రభాకర్, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. చెంచులక్ష్మీపురంలోని నాగులవరం సొసైటీలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్ అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులు లక్కాకుల మాధవరావు, వాయిలసుధాకర్, బీజేపీ జిల్లా నేత ఎన్ఎస్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నేత పీ శ్రీనివాసులు, మండల ఐటీడీపీ అధ్యక్షుడు జీ సంజయ్, మహిళా నేతలు మల్లి అరుణమ్మ, జీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్థానిక నేత రావి విజయ్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేయించారు. అలంకార మండపం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. సాయంత్రం బోగోలు రైల్వే ఎల్సీఏట్ 144 వద్ద జిల్లా ఎస్సీ అధ్యక్షులు బీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు దేవరాల తిరుపతి, ప్యాట్రిక్, పార్వతమ్మల ఆధ్వర్యంలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.



ఎమ్మెల్యే బర్త్‌డే కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు

కారు ఢీకొని మహిళ మృతి

● పోలీస్‌స్టేషన్ ముందు బంధువుల ఆందోళన

వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి కొండకింద ముఖద్వారం వద్ద శనివారం ఉదయం జరిగింది. ఎస్ఐ మరిదినాయుడు కథనం ప్రకారం... మృతురాలు దత్తమణిశ్రీ (28) తన భర్త మాధవరావుతో కలిసి శనివారం ఉదయం 7 గంటలకు మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి రోడ్డు మార్జిన్ దిగి కాలినడకన కొండకింద ముఖద్వారం వద్దకు వెళ్తుండగా కందుకూరు నుంచి పామూరు వైపు అతివేగంగా వెళ్తున్న కారు దత్తమణిశ్రీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకొని మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మరిదినాయుడు తెలిపారు. కాగా, నిందితులను అదుపులోకి తీసుకొని న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు కొద్దిసేపు వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్ ముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. కారు యజమానిని పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ మరిదినాయుడు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



పోలీస్‌స్టేషన్ ముందు బంధువులు, దత్తమణిశ్రీ మృతదేహం

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో శనివారం రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌లను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు చేపట్టాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంతో అందుకు చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పరిశ్రమలు : పొన్నెబోయిన

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై నమ్మకంతో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రూ.12 లక్షల కోట్ల పరిశ్రమలకు స్థాపనకు ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమల స్థాపనతో రాబోయే రోజుల్లో 13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయన్నారు.

చలో రాజధాని కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రవేటీకరణ చేసేందుకు చేస్తున్న కుట్రలను వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో రాజధాన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు హజరత్తయ్య కోరారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విద్యుత్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నూరుశాతం ప్రైవేటీకరణ చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. దీనివల్ల ప్రజలు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అందరం కలిసికట్టుగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కాకు వెంకటయ్య, విజయరామిరెడ్డి, ఓంకార్, రమణారెడ్డి, అలీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హజరత్తయ్య

గ్రామ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉండాలి : చింతల

సీతారామపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు అన్నారు. పండ్రంగి గ్రామ సమీపంలోని పాండు రంగ విఠలేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం మండల టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని గ్రామ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మాలకొండయ్య, మండల ప్రధాన కార్యదర్శి యం సుమన్‌బాబు, ఎంపిటిసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల కమిటీ నాయకులు షేక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో ఉపాధి హామి, పంచాయతీ నిధులు సుమారు రూ. 18 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, సంగం సొసైటీ త్రిసభ్య కమిటీ మెంబర్ పిట్టు పట్టాభిరామిరెడ్డి, ఉపసర్పంచ్ మాధవరావు, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ తన తండ్రి జ్ఞాపకార్థం శనివారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి పోలయ్య, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో తెలుగు, బాలల సాహిత్యం, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలను ఉంచారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన ఏఎస్‌పేటకు చెందిన నాణేల సేకరణకర్త ఎండి వాయిజ్ సహకారంతో గ్రంథాలయంలో నాణేల ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.



అనంత సాగరం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

● **అనంతసాగరం:** ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయుడు పాపిశెట్టి నరసింహులు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో జేవీవీ నాయకులు గాడి సుధాకర్, గ్రంథ పాలకుడు నారాయణ రావు పాల్గొని పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● **వింజమూరు:** పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కళాశాల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి జ్యోతికొండయ్య పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై సీఐ వేమారెడ్డి వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సంగం చెక్ పోస్టు కూడలిలో వాహనాలను నిలిపి రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తామని వాహనదారులచే సంతకాలు చేయించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

అనంతసాగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సర్పంచులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా కొందరు పాలవర్గ సభ్యులు తమ గ్రామాల్లో వీధి దీపాలు, తాగునీరు, సీసీ రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో రామచంద్రయ్య పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

5న ఆయకట్టు రైతులకు సాగునీటి విడుదలకు చర్యలు

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం ఆయకట్టు పరిధిలోని రైతులకు ప్రధాన కాలువల ద్వారా డిసెంబరు 5న సాగునీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి, జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. శనివారం జలాశయ ఆవరణలో ఆయకట్టు పరిధిలోని రైతులు, డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతనెలలో తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు జలాశయం నీటిమట్టం 25 అడుగులకు చేరిందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువల కింద 16వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటితో 5,600 ఎకరాల సాగుకు నీరు అందించే అవకాశముందన్నారు. రైతులు మెట్ట పంటలను సాగు చేసుకోవాలన్నారు. జలాశయ పరిధిలోని కాలువల్లో చెట్ల తొల గింపు, పూడికతీత మరమ్మతులకు రూ.74 లక్షల నిధులతో 14 పనులు మంజూరయ్యాయన్నారు. ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులను ఈనెల చివరి నాటికి పూర్తిచేయాలన్నారు. గతంలో పనులకు త్వరలో బిల్లులు మంజూరవుతాయన్నారు. పనులు పూర్తిచేయకపోతే నిధులు వెనక్కి వెళతాయన్నారు. కాలువల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు వేణు, సురేష్, జలాశయ కమిటీ వైస్ చైర్మన్ కుమ్మిత రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జలాశయ చైర్మన్ వెంకట సుబ్బయ్య

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఎంపీడీవో

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరి సూచించారు. మండలంలోని కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఉదయగిరి:** ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, వీధి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు, ఏఈ జగన్నాథం, పంచాయతీ ఈవో కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి : జేవీవీ

వరికుంటపాడు(ఉదయగిరి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని జేవీవీ వ్యవస్థాపకులు, జాతీయ నాయకులు బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం కనియంపాడులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక పేరుతో సదస్సులు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతంచేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కాగా, తెలుగు జాతికి మనసు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం తన బృందంతో కలిసి ఆయన కనియంపాడు గ్రామ సమీపంలోని కేంద్రాన్ని సందర్శించారు. వందేళ్ల నాటి పత్రాలు, తాళపత్ర, సాహిత్య గ్రంథాలు, ప్రముఖ రచనలను యధావిధిగా డిజిటలీకరణ చేసి పాఠకులకు ఉచితంగా అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి, విశ్వనాద్, గౌరవ సలహాదారులు శేషారెడ్డి, సర్పంచు దిలీప్ కుమార్, పఠాన్ రసూల్, సరాబు లక్ష్మీనారాయణ, చల్లగాలి వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి విద్యుత్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శనివారం కొణిదెల సుధీర్‌చౌదరి బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న ఆయనకు ఉన్నతాధికారులు డీఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.